
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి





డీసీసీబీ సభ్యుల రాజీనామాలేవి?

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 9 : నామినేటెడ్ పదవులు రద్దు చేస్తూ ప్రభుత్వం ఈ నెల 7వ తేదీన ఉత్తర్వులు జారీచేసింది. అయితే జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు పాలకవర్గం మాత్రం నేటికి తమ రాజీనామా పత్రాలను సమర్పించలేదు. కమిటీలో ఛైర్మన్‌తో పాటు ఆరుగురు సభ్యులు ఉంటారు. రాజీనామాల వ్యవహారంపై కోఆపరేటివ్ బ్యాంకు అధికారులను వివరణకోరగా ప్రభుత్వ ఉత్తర్వులు 7వ తేదీన వచ్చాయని శనివారం, ఆదివారం సెలవు దినాలు కావడంతో సోమవారం రాజీనామా పత్రాలు సమర్పిస్తారని చేశారు.ఇదిలా ఉండగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఛైర్‌పర్సన్లు, పర్సన్ ఇన్చార్జ్‌లు(త్రీమెన్ కమిటీ) తమ రాజీనామా పత్రాలను ఆయా సంఘాల సీఈవోల ద్వారా కోఆపరేటివ్ డిప్యూటీ రిజిస్ట్రార్‌కు పంపించారు. తక్షణమే వాటిని ఆమోదించినట్టు తెలిసింది. వైసీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి సొసైటీలకు ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ కమిటీల ద్వారా నడిపించారు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 305 పీఏసీఎస్‌లు ఉన్నాయి.



పుస్తకాలను పరిశీలిస్తున్న డీఈవో వాసుదేవరావు

స్టూడెంట్ కిట్స్ సిద్ధం చేయండి : డీఈవో

రంగంపేట,జూన్ 10 : పాఠశాలలు తెరిచేనాటికి స్టూడెంట్ కిట్స్ సిద్ధం చేయాలని డీఈవో కె.వాసుదేవరావు సూచించారు. రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న స్టూడెంట్ కిట్స్ స్టాక్ పాయింట్‌ను సోమవారం ఆకస్మికంగా సందర్శించి మాట్లాడారు. పాఠ్య పుస్తకాలు 29,929, నోటు పుస్తకాలు 27,772, బెల్ట్‌లు 2501 నిల్వ కేంద్రంలో ఉన్నాయని ఎంఈవో పి.మధుసూదనరావు చెప్పారు. మిగిలిన సామగ్రి కూడా ఈ వారం లోగా అందజేయడానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌ఎంటీలు దుర్గారావు, సూర్యనారాయణ,శ్రీనివాసరాజు,ఐఆర్‌టి ప్రసాద్, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్స్, వెంకటేశ్వర్లు, మూర్తి, చిన్నారావు, బూరిబాబు, ప్రసన్న, శ్రీలక్ష్మి,లక్ష్మి, భవాని, రుద్రయ్య, నాగరాజు పాల్గొన్నారు.

ఫ్యాన్ గాలివీయక..లబోదిబో

నిండా మునిగిన పందెగాళ్లు

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 10 : పాలకుల నిర్వాకంతో పందెంరాయుళ్ళు లబోదిబోమంటున్నారు. ఎన్నికలు వచ్చాయంటే మా పార్టీ గెలుస్తుందని ఒకరు.. తమ పార్టీ గెలుస్తుందని మరొకరు పందేలు కాసుకుంటారు. అయితే ఈ సారి ఓడిపోతుందని తెలిసి కూడా పందాలు వేసి చేతులు కాల్చుకున్నారు. వైసీపీ అత్యుత్సాహంతో నాయకులు, కార్యకర్తలు నాశనమైపోయారు. మనం గెలుస్తాం అంటూ అటు జగన్.. ఇటు నాటి మంత్రులు విపరీతమైన ప్రకటనలు చేశారు. దీంతో కొంత మంది వైసీపీ నాయకులు.. కార్యకర్తలు పెద్ద ఎత్తున పందాలు కాశారు. అధికారులు కూడా పందాలు కాసి చేతులు కాల్చుకున్నట్టు తెలుస్తుంది. ఎన్నికలైన రెండు రోజుల వరకు పందాల కోసం ఊగిన పందెంరాయుళ్ళు ఆ తరువాత సీన్ అర్థమై ఆగిపోయారు. రెండు రోజుల్లో ఫలితాలు వస్తాయనగా మరలా ఊగారు. రాజానగరం నియోజకవర్గం పరిధిలో కొంత మంది అధికారులే వైసీపీ విజయం సాధిస్తుందంటూ పందాలు వేయటమే కాకుండా కొంతమందిని ప్రోత్సహించినట్టు తెలుస్తుంది. గ్రామాల వారీ మెజారిటీలపై కూడా కోట్లలో పందాలు కాసి వైసీపీ నాయకులు, కార్య కర్తలు మునిగిపోయారు. రూరల్ నియోజకవర్గం పరిధిలో కూడా గ్రామాల్లో మెజారిటీలపై భారీగా పందాలు జరిగాయి. బంగారం తాకట్టు పెట్టి మారీ పందాలు కాసి చేతులు కాల్చుకున్నారు. కొంతమంది తెలివైన వైసీపీ నాయకులు మాత్రం కూటమి అభ్యర్థులపై పందాలు కాసి సొమ్ములు చేసుకున్నారు. ఏది ఏమైనా పాలకుల పుణ్యమో అంటూ క్యాకర్తలు, అమాయకుల సొమ్ములు కోట్లలో ఆవిరైపోయాయి.

సెంట్రల్ జైలు నుంచే..



చంద్రబాబు ప్రమాణస్వీకార ఏర్పాట్లు

సెంట్రల్ జైలు వద్ద మాట్లాడుతున్న పవన్ (ఫైల్)

గెలుపు..మలుపు..

రేపు చంద్రబాబు ప్రమాణ స్వీకారం

- జైలు వద్ద కలిసిన పొత్తు
- జనసేన అధినేత ప్రకటనతో మార్పు
- జగన్ పతనం ఆరంభమన్న పవన్
- కూటమి అఖండ విజయం
- ఫలించిన చంద్రబాబు శపథం
- రేపు కేసరపల్లికి జనం
- లక్షలాదిగా వెళ్లేలా ఏర్పాట్లు
- నియోజకవర్గానికి 4 బస్‌లు
- ఆహారానికి ప్రత్యేక పాయింట్లు
- జిల్లాలో 29 చోట్ల స్ర్కీన్లు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఓటమే విజయానికి నాంది పలుకుతుంది.. కష్టమే గెలవాలనే దారిచూపుతుంది.. కూటమి విజయమే అందుకు ఉదాహరణ..2019లో టీడీపీకి వచ్చినవి కేవలం 23 సీట్లు.. అది రాజకీయ ఓటమి..ఆ తరువాత ఎన్నో అవమానాలు.. ఎన్నో కుట్రలు అన్నీ తట్టుకుని నిలబడ్డారు చంద్రబాబు..ఆనాడే అసెంబ్లీలో శపథం చేశారు.. మళ్లీ ముఖ్యమంత్రిగానే అసెంబ్లీలో అడుగుపెడతానని.. అయినా జగన్ వదల్లేదు.. మరింత కుంగదీయాలని సెంట్రల్ జైలులో పెట్టారు.. టీడీపీకి పెద్ద కష్టం..ఆ కష్టం నుంచి ఎలా బయటపడాలి.. అపర చాణక్యుడు చంద్రబాబు ఆ కష్టం నుంచే గెలుపునకు బాటలు వేశారు.. పవన్‌ను రంగం లోకిదించారు..సెంట్రల్ జైలు బయట పవన్ కల్యాణ్ ఇక్కడి నుంచే వైసీపీ పతనం ఆరంభ మైందని ప్రకటించారు. వైసీపీ అరాచకపాలన అంతానికి అంకురార్పణ చేశారు.. ఏకంగా 164 సీట్లు సాధించారు.అటు చంద్రబాబు చేసిన శప థం నెరవేరింది..ఇటు పవన్ కల్యాణ్ చేసిన హెచ్చరిక నిజమైంది.దీంతో బుధవారం చంద్రబాబు సీఎంగా ప్రమాణస్వీకారం చేయనున్నారు.

సెప్టెంబరు 14న పవన్ ప్రకటన..

గతేడాది చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో బంధించిన విషయం తెలిసిందే. జగన్ తన పత నానికి తానే నిప్పు పెట్టుకున్న రోజు అదే. ఢిల్లీ నుంచి గల్లీ వరకూ చంద్రబాబుకు సంఘీభావం వెల్లువైంది. జనసేనాని పవన్ కల్యాణ్ 2023 సెప్టెంబరు 14న రాజమహేంద్రవరం వచ్చి చంద్రబాబును జైలులో పరామర్శించారు. తర్వాత జైలు బయట మీడియా సమావేశంలో రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయం, ఆవేదనలో మునిగిపోయిన ప్రజల గురించి ఏకరువు పెట్టారు. చంద్రబాబును జైలులో పరామర్శించి వచ్చిన తర్వాత రాష్ట్ర క్షేమం కోసం వెన్నుదన్నుగా నిలవాలని నిర్ణయించుకున్నారు.జనసేన, తెలుగుదేశం కలిసి వెళతాయ్' అని ప్రకటించారు.రాసి పెట్టుకో జగన్ అరాచక పాలనకు అంతం తప్పదంటూ హెచ్చరించారు. రాష్ట్రానికి మళ్లీ మంచి రోజులు రావడానికి ఆ క్షణమే మౌన సాక్ష్యంగా నిలిచింది.పవన్ కల్యాణ్ టీడీపీతో పొత్తు ప్రకటించిన తర్వాత ఇటు టీడీపీ, జనసేన అటు బీజేపీ శ్రేణుల్లో ఎలాంటి అంతర్గత ఇబ్బందులూ రాకుండా సమతూకంగా ముందుకు నడిచారు. జన సైనికులకు ఎప్పటికప్పుడు మార్గనిర్దేశం చేస్తూ ఎక్కడా పొరపొచ్చాలు లేకుండా టీడీపీ, బీజేపీ వారితో కలిసి జనసేన నడవడంలో చారిత్రాత్మకమైన పాత్ర పోషించారు. సీట్ల పంపకాల విషయంలో చెలరేగిన కొద్దిపాటి అలజడినీ శాంతి ంపజేశారు. 'ఎక్కడ నెగ్గాలో కాదు..ఎక్కడ తగ్గాలో' చేతల్లో చూపించి రాష్ట్రాన్ని చీకటి నుంచి మళ్లీ వెలుగుల్లోకి తీసు కురావడానికి ఊతమై నిలి చారు. చివరికి ఓటరు తీర్పు సునామీలో జగన్ కొట్టుకుపోయేలా చేశారు. రేపు చంద్రబాబు సీఎంగా ప్రమాణస్వీకారం చేయనున్నారు.

జిల్లాలో 29 చోట్ల స్ర్కీన్స్ ఏర్పాటు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

కూటమి నాయకులు ఆనందంలో మునిగి తేలుతున్నారు. చంద్రబాబు నాల్గో సారి ముఖ్యమంత్రిగా బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో పెద్ద ఎత్తున సంబరాలు చేసేందుకు సన్నద్ధమవున్నారు.ఆ మహోత్సవానికి కూటమి శ్రేణులు, అభిమానులు ప్రజలు తరలి వెళ్లనున్నారు.చంద్రబాబు నాయుడు ఈ నెల 12న ప్రమాణస్వీకారం చేయడాన్ని ప్రజలంతా ప్రత్యక్షప్రసారం ద్వారా చూసేందుకు ఏర్పాట్లను అధికార యంత్రాంగం చేస్తుంది. ఇప్పటికే ఏర్పాట్లపై చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలిచ్చారు. ముఖ్యంగా ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి జిల్లాల నుంచి పెద్దఎత్తున ప్రజలు చంద్రబాబు ప్రమాణస్వీకారాన్ని తిలకించేందుకు వెళ్ళనున్నారు.ఈ మేరకు నియోజకవర్గం నుంచి 4 బస్సులు చొప్పున ఏర్పాటు చేస్తున్నారు.వారికి మార్గమధ్యంలో అల్పాహారం ఏర్పాటు చేస్తున్నారు.ప్రమాణస్వీకారోత్సవానికి వెళ్ళలేని వారికోసం మండలాల్లో డిజిటల్ స్ర్కీన్స్ ఏర్పాటు చేసి ప్రత్యేక ప్రసారం ద్వారా చూసే అవకాశం కల్పిస్తున్నారు.జిల్లా కలెక్టరు, అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించి పూర్తి చేస్తున్నారు. కృష్ణా జిల్లా గన్నవరం మండల పరిధి కేసరపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకార మహోత్సవ సభా వేదిక వద్దకు లక్షలాది మంది ప్రజలు తరలివెళ్లనున్నారు. మరికొందరు స్వచ్ఛందం బస్సులు, ఇతర వాహనాలపై వెళ్లేందుకు స్వచ్ఛందంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా ప్రజలు చూడడం కోసం జిల్లాలో 29 చోట్ల డిజిటల్ స్ర్కీన్స్ ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ మాధవీలత తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలకు లైటింగ్ ఏర్పాటుచేయాలని ఆదేశించారు. చంద్రబాబును విజయవాడలో సోమవారం అనపర్తి ఎమ్మెల్యే విజేత నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పా రావు మర్యాదపూర్వకంగా కలిసి అభినందలు తెలిపారు.

చంద్రబాబుకు అభినందన



చంద్రబాబు నాయుడు బుధవారం ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు.. ఈ మేరకు పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శాలువా కప్పి చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు బుద్ధుడి విగ్రహాన్ని అందించి అభినందనలు తెలిపారు. జిల్లాకు చెందిన పలువురు నాయకులు సోమవారం ఆయనను కలిశారు.



నిలిచిన మీ సేవలు

10 రోజులవుతున్నా పనిచేయక నిర్వాహకుల ఇక్కట్లు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 10 : ఐటీ సర్వర్లు హోల్డ్‌లోకి వెళ్లడంతో ఎక్కడికక్కడ మీసేవల్లో సేవలు నిలిచిపోయాయి. విజయవాడ ఎస్‌డీసీ డాటా సెంటర్‌లో సర్వర్ల సమస్య, నెట్ వర్క్ ఇష్యూలతో రాష్ట్రంలో మీసేవలు బంద్ అయ్యాయి. గత ఐదేళ్లగా మీ సేవల నిర్వాహకులు చాలా ఇబ్బందులు పడ్డారు. ఎందుకంటే సచివాలయాల ద్వారా కొన్ని సేవలను చేయడంతో మీసేవలకు వివిధ సర్వీసులు అందించే అవకాశం లేకుండా నిర్వహణ కష్టతరమైంది. ఎలక్షన్ నోటిఫికేషన్ విడుదలయ్యాక మీసేవల వద్ద ప్రజలు వివిధ సేవలకు క్యూకట్టారు. అప్పట్లో ముఖ్యమంత్రి జగన్ ఫొటోతో ఉన్న సర్టిఫికెట్లు నిలుపుదల చేసి రాజదముద్రతో సర్టిఫికెట్లు జారీ మొదలు పెట్టారు. కేవలం వారం రోజులు మాత్రమే ఈ విధమైన సేవలందించారు. పరిస్థితి సాధారణ స్థితికి చేరుకుందనుకునేలోగా విజయవాడలో ఐటీ, ఏపీ ఫైబర్ నెట్ కార్యాలయంపై ప్రభుత్వ తనిఖీలు చేపట్టడంతో ఐటీ సర్వర్లు హోల్డ్‌లోకి వెళ్లాయి. ఫలితంగా మీసేవలో సేవలు ఆగాయి. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ,ప్రైవేట్ నిర్వహణలో సుమారు 400పైబడి మీసేవ కేంద్రాలు ఉన్నాయి.గత ఐదేళ్లగా ప్రభుత్వ నిర్వహణలో ఉన్న సెంటర్లు మినహా, నిరుద్యోగులు ఉపాధి కోసం ప్రైవేట్‌గా ఏర్పాటు చేసుకున్న మీ సేవ సెంటర్లు మాత్రం తీవ్రమైన సంక్షోభంలో ఉన్నాయి. అనేక సేవలు సచివాయలకు బదలాయించడంతో మీసేవ కేంద్రాలు వెలవెలబోయాయి. ఎన్నికల్ కోడ్ అమల్లోకి వచ్చాక కాస్త ఊరట చెంది సర్వీసులు అందిస్తున్న మీసేవ నిర్వాహకులకు ఇప్పుడు ఐటీ హోల్డ్‌లోకి వెళ్లి సేవలకు అటంకం ఏర్పడింది. కేవలం రెండు రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందని అధికారులు చెప్పారు. ఇప్పటికి పదిరోజులైనా పరిష్కరించలేదు. దీంతో మీసేవ కేంద్రాల నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. సర్వర్ల సమస్య ఎప్పటికి పరిష్కారమ వుతుందో అని మీసేవ కేంద్రాల నిర్వాహకులు ఎదురుచూస్తున్నారు. కూటమి అధికారంలోకి రావడంతో మళ్లీ చంద్రబాబు సీఎంగా సర్వీసులన్నింటిలో మార్పులు తీసుకురావాల్సి ఉంది. దీంతో మొత్తం సాఫ్ట్‌వేర్‌లను అధికారులు అప్‌డేట్ చేస్తున్నారు. దీంతో సర్వర్లు హోల్డ్‌లో పెట్టారు.

ఖరీఫ్..రిలీఫ్!



కడియంలో సిద్ధమైన నారుమడి

చిగురిస్తున్న ఆశలు

- ముందస్తు సాగుకు అన్నదాత సన్నద్ధం
- 743 హెక్టార్లలో నారుమడులు పూర్తి
- సాగులో 2,19,171 మంది రైతులు
- 58,356 టన్నుల ఎరువులు అవసరం
- 30 వేల టన్నులే దిగుమతి
- రైతాంగం ఎదురుచూపులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

జిల్లా రైతాంగం కష్టాల మధ్యే ఖరీఫ్ సాగుకు ఉపక్రమించారు.. ఇంకా చాలా మంది రైతులకు ధాన్యం అమ్మిన సొమ్ములు చేతిలో పడలేదు.. మరో పక్క సాగుకు సమయమైంది.. దీంతో రైతులు అప్పులు చేసి సాగులో దిగారు. గత ఐదేళ్లలో ఏం పంట వేయాలో, ఏ రకం ధాన్యం పండించాలో.. అసలు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏ మేరకు కొంటుందో.. డబ్బులు ఎప్పుడిస్తుందో అర్థంకాని పరిస్థితి.. బొండాల రకం ధాన్యం ధర బాగుంటుందని ఎక్కువ మంది పండిస్తే తాము కొనేది లేదని.. కేంద్రం నుంచి అనుమతి లేదని తీవ్ర ఇబ్బందులు పెట్టిన రోజులు రైతులు మర్చిపోలేదు.ఈ ఏడాది రబీలో పండించిన పంటను పూర్తిగా కొనలేదు. కొన్న ధాన్యానికి ఇంకా సుమారు రూ.200 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉంది. గతంలో కౌలు రైతులు జిల్లాలో 96 వేల మంది ఉన్నట్టు గుర్తించినా కౌలు రుణకార్డులు ఇవ్వలేదు.. కాలువల ఆధునికీకరణ లేదు..డ్రెయిన్లలో తూడు తొలగించలేదు. అయితే రైతులు మళ్లీ తమ ప్రభుత్వం వచ్చిందని కష్టమైనా ఎదు ర్కొని ఖరీఫ్ సాగు చేస్తామనే దిశగా ముందుకు కదులుతున్నారు. జిల్లాలో మొత్తం 2,19,171 మంది రైతులు ఉన్నారు. 85,410 హెక్టార్ల ఆయకట్టు ఉంది. ప్రతి ఏడాది 74,856 హెకార్లు సాగులో ఉంటుంది. వరి సాధారణ ఆయకట్టు 78,789 హెక్టార్లు. సాగు అంచనా ప్రకారం 71,515 హెక్టార్లలో పంట ఉంటుంది. మిగిలిన భూమి మొక్కజొన్న, మిర్చి, కందులు, పెసలు తదితర రకాలు సాగు చేస్తున్నారు.

77,817 హెక్టార్లలో ఆయకట్టు

జిల్లాలో 77,817 హెక్టార్లలో సాధారణ వరి ఆయకట్టు ఉంది. ప్రస్తుతం నారుమడి దశలో ఉంది. రాజమహేంద్రవరం రూరల్ మండలంలో 1521 హెక్టార్లలో సాగుకు 76 హెక్టార్ల నారుమడి అవసరం. ఇంత వరకూ 3 హెక్టార్లలో నారుమళ్లు సిద్ధం చేశారు. కడియంలో 2220 హెక్టార్లకు 111 హెక్టార్ల నారుమళ్లు అవసరం 15 హెక్టార్లలో వేశారు. రాజానగరంలో 4842 హెక్టార్లకు 242 హెక్టార్ల నారు అవసరం ఇప్పటి వరకూ 100 హెక్టార్లలో వేశారు. అనపర్తిలో 3821 హెక్టార్లకు 191 హెక్టార్ల నారు అవసరం కేవలం రెండు హెక్టార్లలో వేశారు. బిక్కవోలులో 6224 హెక్టార్లకు 311 హెక్టార్ల నారు అవసరం 3 హెక్టార్లలో వేశారు. కోరుకొండలో 5912 హెక్టార్లకు 296 హెక్టార్ల నారు కావాలి 10 హెక్టార్లలో వేశారు. గోకవరంలో 5124 హెక్టార్లలకు 256 హెక్టార్ల నారు అవసరమైనా ఆరంభం కాలేదు. సీతానగరంలో 5665 హెక్టార్లకు 283 హెక్టార్ల నారు అవసరం 12 హెక్టార్లలో వేశారు. రంగంపేటలో 2868 హెక్టార్లకు 143 హెక్టార్ల నారు అవసరం 52 హెక్టార్లలో వేశారు.చాగల్లులో 3484 హెక్టార్లకు 174 హెక్టార్ల నారు అవసరం 110 హెక్టార్లలో వేశారు. దేవరపల్లిలో 3718 హెక్టార్లకు 186 హెక్టార్లు అవసరం ఇప్పటి వరకూ 40 హెక్టార్లలో వేశారు.గోపాలపురంలో 4137 హెక్టార్లకు 207 హెక్టార్ల నారు అవసరం కేవలం ఒక హెక్టారులో వేశారు. కొవ్వూరులో 4589 హెక్టార్లకు 229 హెక్టార్ల నారు అవసరం 160 హెక్టార్లలో వేశారు. నిడదవోలులో 7235 హెక్టార్లకు 362 హెక్టార్ల నారు అవసరం 120 హెక్టార్లలో వేశారు. పెరవలిలో 3335 హెక్టార్లకు 167 హెక్టార్ల నారు అవసరం 25 హెక్టార్లలో వేశారు. తాళ్లపూడిలో 3832 హెక్టార్లకు 192 హెక్టార్ల నారు అవసరం 40 హెక్టార్లలో వేశారు. ఉండ్రాజవరంలో 4995 హెక్టార్లకు 250 హెక్టార్ల నారు అవసరం 25 హెక్టార్లలో వేశారు. నల్లజర్లలో 4295 హెక్టార్లకు 215 హెక్టార్ల నారు అవసరం 25 హెక్టార్లలో వేశారు. జిల్లాలోని 77,817 హెక్టార్లకు 3891 హెక్టార్ల నారు అవసరం. ఇప్పటి వరకూ 743 హెక్టార్ల నారు వేశారు.ఇంకా ఎక్కడా నాట్లు పడలేదు.

ఎరువులు సిద్ధం

జిల్లాకు 58,356 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం. 25,802 టన్నుల యూరియా, 5028 టన్నుల డీఏ పీ, 6327 టన్నుల ఎంవోపీ, 15,889 టన్నుల ఎన్‌పీకే, 5310 టన్నుల ఎస్ఎస్‌పీకి ఎరువులు అవసరం. కానీ ఇప్పటి వరకూ జిల్లాకు యూరియా 13551 టన్నులు,డీఏపీ 1767 టన్నులు, ఎంవోపీ 1944 టన్నులు, ఎన్‌పికె 9134 టన్నులు, ఎస్ఎస్‌పి 3602 టన్నులు వచ్చాయి.ఇప్పటికే రైతులు కొనుగోలు చేసిన దాట్లో 2774 టన్నుల యూరియా,270 టన్నుల డీఏపీ, 552 టన్నుల ఎంవోపీ, 1746 టన్నుల ఎన్‌పికె, 741 టన్నుల ఎస్ఎస్‌పీ ఎరువులు ఉన్నాయి.28,356 టన్నుల ఎరువులు రావలసి ఉంది.

ఎకరాకు రూ.50 వేల పెట్టుబడి..



తొమ్మిదెకరాల్లో కౌలు సాగు చేస్తున్నా. దాళ్వాలో వాతావరణం అనుకూలిస్తే 30 బస్తాలు దిగుబడి వస్తుంది. సార్వాలో 35 నుంచి 45 బస్తాల దిగుబడి వస్తుంది. ఎకరాకు రూ.50 వేల వరకు పెట్టుబడి అవుతుంది. ఐకేపీ ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తే గిట్టుబాటు ధర లభిస్తుంది.అయితే దేవరపల్లి మండలంలో ధాన్యం కొనుగోలు చేసే రైసుమిల్లులు లేక ఇబ్బందులు పడుతున్నాం.

- గద్దె శరత్‌బాబు, కౌలురైతు, సంగాయిగూడెం


ఆకుమడులు వేస్తున్నాం..



నేను 10 ఎకరాల్లో సాగు చేస్తున్నా. మృగశిర కార్తె ఆరంభం కావడంతో కాలువ నీరు ముందుగా వచ్చే ప్రాంతంలో ఆకుమడులు వేసుకుంటున్నాం. గతంలో స్వర్ణ రకం వేశా. శిస్తు కాకుండా దమ్ము చేసే సమయం నుంచి నాట్లు, ఎరువులు, పురుగుమందులు, కూలీలు, కోత, నూర్పు వంటి వాటికి ఎకరానికి రూ. 30 వేల వరకు ఖర్చవుతుంది.

- తోరాటి కృష్ణమూర్తి, కడియం

ఈసారి ముందస్తు ఖరీఫ్



ఈసారి ముందస్తు ఖరీఫ్ సాగవుతుంది. దీని వల్ల నవంబరులో వచ్చే తుఫాన్‌ల నుంచి 70 శాతం పంట బయటపడుతుంది.ఈ నెల 15వ తేదీకి నారుమళ్ల పూర్తి కావలసి ఉంది. జూలై నెలాఖరుకు నాట్లు పూర్తవుతాయి. 70 శాతం కోతలు అక్టోబరు, మిగతా 30 శాతం నవంబర్‌లో పూర్తవుతుంది. జిల్లాలో 30 శాతం స్వర్ణ, ఎంటీయూ 7029, పీఎల్‌ఏ 1100 రకాలు 30 శాతం సాగు చేస్తున్నారు. 15 శాతం ఎంటీయూ 1318, 5 శాతం బీపీటీ 5204 సాగు చేస్తున్నారు. రబీలో విత్తనాలకు ఎంటీ యూ 1121,1156, 1153 రకాలు సాగు చేస్తున్నారు.

- ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయాధికారి



ఆరంభమే..తర్వాత వదిలేశారు : రాజమండ్రి వైపు గడ్డరు లేకుండా ఉన్నబ్రిడ్జి.. కొవ్వూరు వైపున గడ్డరు లేకుండా ఉన్నబ్రిడ్జి

రోడ్ కం రైలు బ్రిడ్జిపై నిర్లక్ష్యం

- రెండు వైపులా విరిగిన గడ్డర్లు
- భారీ వాహనాల రాకపోకలు
- బ్రిడ్జి మనుగడ ప్రశ్నార్థకం
- పట్టించుకోని అధికారులు
- కొత్త పాలకులైనా దృష్టి పెట్టాలి

కొవ్వూరు, జూన్ 10 : రోడ్డు కం రైలు బ్రిడ్జిపై భారీ వాహనాల రాకపోకలను నిషేధిస్తూ వేసిన గడ్డర్లు భారీ వాహనాలు ఢీకొని విరిగి పడిపోతున్నాయి. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో రాత్రి సమయాల్లో వంతెనపై భారీ వాహనాలు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. భారీ వాహనాల ఢీకొని బ్రిడ్జికి ఇరువైపులా వేసిన గడ్డర్లు గత నెల రోజులుగా విరిగి కింద పడి ఉన్నాయి. బ్రిడ్జిని పరిరక్షించాల్సిన అధికారుల మధ్య సమన్వయ లోపంతో గోదావరి జిల్లాల ప్రజలు తరచుగా ఇబ్బందులు పడుతున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందిం చి ప్రజలకు ఇబ్బంది లేకుండా రోడ్డు కం రైలు బ్రిడ్జికి పూర్తిస్థాయి భద్రత కల్పించాలని వాహనదారులు కోరుతున్నారు. కొవ్వూరు,రాజమహేంద్రవరంలను కలుపుతూ గోదావరి నదిపై నిర్మించిన రోడ్డు కం రైలు బ్రిడ్జే ఉభయ గోదావరి జిల్లాలకు ఆధారం.అటువంటిది రోడ్డు కం రైలు బ్రిడ్జి మనుగడ నేడు ప్రశ్నార్థకంగా మారింది. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం రోడ్డు కం రైలు వంతెన పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో బ్రిడ్జి పూర్తిగా శిథి లావస్థకు చేరింది. తాత్కాలిక మరమ్మతుల పేరుతో గత రెండేళ్లలో సుమారు ఏడెనిమిది సార్లు వంతెనను మూసివేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేశారు. తాజాగా 2023 సెప్టెంబరు 26వ తేదీ నుంచి నవంబరు 11వ తేదీ వరకు వంతెనను మూసివేసి రూ.2.10 కోట్లతో మరమ్మతు పనులు చేపట్టారు. ఆ పనులు ఇప్పటికి కొనసాగుతూనే ఉన్నాయి.పనుల్లో నాణ్యత ఉందా అంటే ఆ దేవుడుకే ఎరుక. వంతెనపై గతంలో ఉన్న తారు రోడ్డును తొలగించి, మరలా కొత్తగా తారు రోడ్డు వేశారు అంతే. వంతెన పటిష్టతకు పూర్తిస్తాయిలో చేసిందేమి లేకపోవడంతో బ్రిడ్జిపై భారీ వాహన రాకపోకలను నిషేధించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బ్రిడ్జికి రెండు వైపులా ఇనుప గడ్డర్లను ఏర్పాటు చేశారు.అయితే ఆ గడ్డర్లు పూర్తిస్థాయి నాణ్యత లేకపోవడంతో పట్టుమని పదిరోజులు కూడా నిలవడం లేదు.ప్రతిరోజు రాత్రి సమయంలో ఏదో ఒక వాహనం గడ్డర్లను ఢీకొట్టడం విరిగి కిందడిపోవడం పరిపాటిగా మారింది.ఆర్టీసీ బస్సు పైకప్పుపై ఉన్న లగేజి గ్యారేజ్ తగిలి ఇనుపరాడ్లు విరిగి కింద పడిపోతున్నాయి. దీంతో రాత్రి సమయాల్లో యథేచ్ఛగా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వంతెనను పరిరక్షించాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడంలేదు.దీంతో రాత్రి సమయంలో భారీ వాహనాలు, లారీలు వంతెనపై రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రజా రవాణాకు అంతరాయం కలిగించిన అధికారులు, నిబంధనలను అతిక్రమించి రాకపోకలు సాగిస్తున్న అక్రమ రవాణాకు అనుమతిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇకనైనా రోడ్డు కం రైలు బ్రిడ్జికి పటిష్టతకు సంబంధిత శాఖల అధికారులందరిని సమన్వయపరిచి కొత్త ప్రభుత్వంలోనైనా వంతెనకు పూర్తిస్థాయిలో శాశ్వత మరమ్మతులు చేపట్టే విదంగా చర్యలు తీసుకోవాలని గోదావరి జిల్లాల ప్రజలు కోరుతున్నారు.

రంప అటవీ డివిజన్‌లో ఎకో టూరిజం అక్రమాలు



గుడిసెలో ఎకో టూరిజం పర్యాటక ప్రదేశం

- అర్థిక నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా నిధుల కేటాయింపు
- పరిధి దాటిన డీఎఫ్‌వో వ్యవహారాలపై విచారణకు ఆదేశించిన సీసీఎఫ్

(రంపచోడవరం)

అల్లూరిజిల్లా రంపచోడవరం అటవీ డివిజన్లో చోటుచేసుకున్న అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. ఈసారి ఎకో టూరిజం వంతు వచ్చి ఆ ప్రాజెక్టుల నిధుల్లో చోటుచేసుకున్న అక్రమాలపై రాజమండ్రి సి.సి.ఎఫ్. విచారణకు ఆదేశించారు. ఇప్పటికే ఈ డివిజన్లో టేకు ప్లాంటేషన్లలో చెట్ల నరికివేత వ్యవహారం రాష్ట్రస్థాయిలో సంచలనమై, బాధ్యులైన ఉన్నతాధికారులపై సైతం చర్యల కోసం ప్రభుత్వం వద్ద ఫైలు పెండింగ్‌లో ఉన్న సంగతి తెలిసిందే! ఇదిలా వుండగా రంపచోడవరం డివిజనల్ అటవీ అధికారి తన పరిధికి మించి అర్థిక నిబంధనలను ఉల్లంఘించి ఏకో టూరిజం నిధులను ఇష్టారాజ్యంగా వెచ్చించడం వివాదంగా మారింది. ఏకో టూ రిజం నిధులను వేటికోసం వెచ్చించాలో, ఎవరి ఆమోదంతో వాటిని వెచ్చించాలో, కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజం(సి.బి.ఇ.టి) ప్రాజెక్టులకు ఉన్న కమిటీలలో ఎవరెవరు ఉండాలి వంటి అంశాలపై అటవీశాఖ నిర్దిష్టమైన ఉత్తర్వులను ఇచ్చినప్పటికీ ఉన్నతాధికారుల అనుమతులు లేకుండా రంపచోడవరం డివిజనల్ అటవీ అధికారి ఎకో టూరిజం నిధులను డ్రా చేసేందుకు, వెచ్చించేందుకు ఆదేశాలను ఇవ్వడం అటవీశాఖ ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నారు.

వివరాల్లోకి వెళితే రంపచోడవరం అటవీ డివిజన్లో మారేడుమిల్లి వనవిహారి, వాలమూరు జంగిల్‌స్టార్, భూపతిపాలెం, గుడిసె ప్రాంతాలలో సి.బి.ఇ.టి. ప్రాజెక్టుల ద్వారా పర్యాటక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రతి ప్రాంతానికి కమిటీల ద్వారానే వీటిని నిర్వహించాలి. కొన్నిచోట్ల కమిటీలు లేకుండానే కార్యకలాపాలను అటవీశాఖ నడిపిస్తోంది. ముఖ్యంగా గుడిసె, వాలమూరు జంగిల్ స్టార్ టూరిజం ప్రాజెక్టుల ద్వారానే పర్యాటకుల నుంచి అధిక ఆదాయాలు వస్తున్నాయి. ఈ ఆదాయాలను ఆయా బ్యాంకు ఖాతాల్లో వేస్తున్నా ఎటువంటి మైక్రో ప్లానుగానీ వార్షిక ప్రణాళికలుగానీ రూపొందించకుండానే ఇక్కడ అన్ని సీబీఈటీల్లో కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. గుడిసె ప్రాజెక్టులో అయితే వాటి నిధులను కూడా కమిటీ లేకుండానే డ్రా చేయడం సాగింది.

నిధుల మళ్లింపు

ఇంతేకాకుండా ఈ టూరిజం నిధులను రంపచోడవరంలో సబ్-డీఎఫ్‌ఓ, డీఎఫ్‌ఓ నివాసాల మరమ్మతుల కోసం, ప్రహరీ గోడ నిర్మాణాలకోసం వాలమూరు జంగిల్ స్టార్ నుంచి మళ్లించేశారు. మారేడుమిల్లి వనవిహారిలో కూడా దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. ఇక్కడి నుంచి డీఎఫ్‌వో వాహనం మరమ్మతుల కోసం, సబ్ డీఎఫ్‌వో నివాసం విద్యుద్దీకరణ కోసం వెచ్చించడం కూడా వివాదమైంది. ఇటీవల రాజమండ్రి సీసీఎఫ్ కార్యాలయంలోని అంతర్గత లెక్కల విభాగం జరిపిన విచారణలో ఇలాంటి అనేక అక్రమాలు వెలుగు చూడటంతో రంపచోడవరం అటవీ డివిజన్లో చోటుచేసుకున్న సీబీఈటీ భాగోతాలపై సీసీఎఫ్ సంచార నిఘా విభాగం డీఎఫ్‌వో, అమలాపురం డీఎఫ్‌వో, పలువురు విజిలెన్సు అధికారులతో కలిపి విచారణకు ఆదేశించారు.



వెండిమబ్బుల ప్రతిబింబాలు అల్లూరి సీతారామరాజు జిల్లా వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయిలో సోమవారం శాండిల్ డ్యాం దగ్గర నీటిలో ప్రతిబింబించిన వెండి మబ్బులతో ఆకాశం పర్యాటకులను కట్టిపడేసిన ప్రకృతి అందాలు. - మోతుగూడెం

నేడు ఏపీఈఏపీసెట్ 2024 ఫలితాలు

- మధ్యాహ్నం 4గంటలకు విజయవాడలో విడుదల
- పరీక్ష రాసిన 2,58,373మంది ఇంజనీరింగ్, 80,766మంది అగ్రికల్చర్ ఫార్మసీ విద్యార్థులు

జేఎన్టీయూకే, జూన్ 10: గత నెలలో 16నుంచి 23 వరకూ ఆన్‌లైన్‌లో ఏపీ, తెలంగాణాలో 49 ప్రాంతీయ కేంద్రాల్లో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్ అగ్రికల్చర్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్‌టెస్ట్(ఏపీఈఏపీసెట్) ఫలితాలను మంగళవారం మధ్యాహ్నం విజయవాడలో రాష్ట్ర ఉన్నత విద్య ప్రధాన కార్యదర్శి జె.శ్యామలరావు ఫలితాలను విడుదల చేస్తున్నట్లు సెట్ చైర్మన్, జేఎన్టీయూకే వీసీ జీవీఆర్ ప్రసాదరాజు తెలిపారు. ఈ పరీక్షను 2,58,373మంది ఇంజనీరింగ్, 80,766మంది అగ్రికల్చర్ ఫార్మసీ విద్యార్థులు రాశారన్నారు. ఫలితాలను విడుదలకు ఏర్పాట్లు చేసినట్లు కన్వీనర్ తెలిపారు.

21న సప్తనదీ తీర్థ మహాజ్యేష్ఠాభిషేక మహోత్సవం



అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి

అంతర్వేది, జూన్ 10: అంతర్వేది పుణ్యక్షేత్రంలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో ఈనెల21న సప్తనదీ తీర్థ మహాజ్యేష్ఠాభిషేక మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. జ్యేష్ఠా నక్షత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం శ్రీలక్ష్మీనరసింహస్వామి మూలవరులకు సప్తనదీ జలాలతో మహాజ్యేష్ఠాభిషేకం జరగనుంది. ఉత్తరప్రదేశ్‌లోని పవిత్ర ప్రయాగ త్రివేణి సంగమంలో గంగా, యమునా, సరస్వతి, గోదావరి, నర్మదా, సింధూ, కావేరి నదీ జాలాలతో స్వామివారికి అభిషేకం నిర్వహిస్తారు. సప్తనదీ జలాలతో జరగబోయే మహాజ్యేష్ఠాభిషేకం, మహాశాంతి హోమంలో పాల్గొనే భక్తులు రూ.400 రుసుం చెల్లించి పూజా కార్యక్రమంలో పాల్గొనవచ్చునని ఆలయ అధికారులు తెలిపారు.

ఐటీఐ విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు

రాజమహేంద్రవరం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవే టు ఐటీఐలలో శిక్షణ పొందుతున్న చివరి ఏడాది విద్యార్థులకు ప్రముఖ కంపెనీలలో ఉద్యోగాల కోసం ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తున్నామని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్ఆర్ఆర్ కృష్ణన్ తెలిపారు. జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్, వికాస, ఏపీఎస్ఎస్‌డీసీ, టాటా స్ట్రీవ్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో నియా మకాలు జరుగుతాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు తమ సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలు, రెజ్యూమ్‌తో ఈనెల 13న హాజరుకావాలన్నారు.

అన్నవరం దేవస్థానం పాలకమండలి సభ్యుడు రాజీనామా

అన్నవరం, జూన్ 10: అన్నవరం దేవస్థానంలో పాలకమండలి సభ్యుడిగా ఉన్న కర్రి బామిరెడ్డి జమిందారు తన రాజీనామాను అన్నవరం దేవస్థానం ఈవో రామచంద్రమోహన్‌కు అందజేశారు. ఈనెల 9న స్వచ్ఛందగా రాజీనామా చేస్తారా ఉత్తర్వులు వచ్చేవరకు ఎదురుచూస్తారా శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఆయన ఈనిర్ణయం తీసుకున్నారు. పాలకమండలిలో చైర్మన్‌తో కలిపి 16మంది సభ్యులుండగా ఒక సభ్యుడు మృతి చెందారు. రెండుపర్యాయాలు వరుసగా పాలకమండలిలో చోటుదక్కించుకున్న బామిరెడ్డి హుందాగా వ్యవహరించి రాజీనామా సమర్పించారని పలువురు దేవస్థానం ఉద్యో గులు చర్చించుకున్నారు. మరో వారంరోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నామినేటెడ్‌పోస్టుల రద్దు ఉత్తర్వులు అధికారికంగా వెలువడే అవకాశాలున్నాయి.

తాటిపర్తిలో కొనసాగుతున్న పోలీస్ పికెట్



గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో ఏర్పాటుచేసిన పోలీసు పికెట్

గొల్లప్రోలు రూరల్, జూన్ 10: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తి గ్రామంలో ఏర్పాటుచేసిన పోలీసు పికెట్లు కొనసాగుతున్నాయి. గ్రామంలోని అపర్ణా సమేత నాగేశ్వరస్వామి, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల నిర్వహణపై టీడీపీ, జనసేన వర్గాల మధ్య వివాదం, తోపులాట జరిగి ఉద్రికత్తలు ఏర్పడిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో ఆలయ తాళాలను, నిర్వహణను రెవెన్యూ, పోలీసు అధికారులకు అప్పగించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు గ్రామంలోని ప్రధాన కూడళ్లు, ఆలయాల వద్ద పోలీసుపికెట్ ఏర్పాటు చేశారు. సాయుధ బలగాలతో బందోబస్తు నిర్వహిస్తున్నారు. పరిస్థితి ప్రశాంతంగా ఉందని పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ బాలాజీలు తెలిపారు.

మౌలిక వసతులు కల్పించాలని మహిళల నిరసన

అంబాజీపేట, జూన్ 10: ఎస్సీ గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ కె.పెదపూడి ఓఎన్‌జీసీ సైట్ వద్ద ఎస్సీ మహిళలు సోమవారం నిరసన చేపట్టారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా నిరసనకారులు మాట్లాడుతూ ఓఎన్‌జీసీ సైట్ ఏర్పాటు చేస్తున్నట్లుగాని, పనులు నిర్వహిస్తున్నట్లుగాని గ్రామసభలు నిర్వహించిన సందర్భాలు లేవన్నారు. ఓఎన్‌జీసీ వాహనాలు రహదారులపై రాకపోకలు సాగించే సమయంలో చెంతనే ఉన్న నివాసాలు బీటలు వారే ప్రమాదం ఉందన్నారు. తక్షణమే రహదారుల అభివృద్ధి, ఇంటింటికి మరుగుదొడ్డి ఏర్పాటు, తాగునీరు సౌకర్యం, విద్యుత్ సౌకర్యంతదితర వసతులను ఏర్పాటుచేయాలని వారు డిమాండ్ చేశారు. గ్రామంలో కమ్యూనిటీ భవనాన్ని నిర్మించాలని వారు కోరారు. వినతిపత్రాన్ని ఓఎన్‌జీసీ అధికారులకు అందించారు.

ప్రధాని మోదీ రాక సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపు

రాజమహేంద్రవరం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఈనెల 12న (రేపు) చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారోత్సవానికి గన్నవరం మండలం కేశరపల్లి గ్రామ సమీపంలోని ఐటీ పార్క్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ వేడుకకు సుమారు లక్ష మంది హాజరవుతారని అంచనా వేస్తున్నారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని స్వయంగా తిలకించడానికి ప్రధాని మోదీ వస్తున్నారు. దీంతో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల ట్రాఫిక్‌ని మళ్లించనున్నారు. బుధవారం ఉదయం 4గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకూ జాతీయ రహదారిపై సరుకు రవాణా, భారీ వాహనాలను రాష్ట్రంలో 12 చోట్ల దారి మళ్లిస్తారు. ఈ విధులకు ఏడుగురు ఐపీఎస్ అధికారులను ప్రత్యేకంగా నియమించారు. విశాఖపట్నం నుంచి చెన్నై వెళ్లే వాహనాలు హెవీ, మీడియం ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు కత్తిపూడి వద్ద దారి మళ్లించి కాకినాడ, అమలాపురం, నర్సాపురం, లోసర బ్రిడ్జి, మచిలీపట్నం, రేపల్లే, బాపట్ల, త్రోవగుంట మీదుగా ఒంగోలు వద్ద జాతీయ రహదారికి చేరుకుంటాయి. ఈ బాధ్యతలను కాకినాడ ఎస్పీ సతీశ్‌కుమార్ పర్యవేక్షిస్తారు. విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనా లను గామన్ బ్రిడ్జి, దేవరపల్లి, జంగారెడ్డిగూడెం, ఖమ్మం గుండా హైదరాబాద్ పంపిస్తారు. ఈ విధులను తూర్పుగోదావరి ఎస్పీ జగదీశ్ పర్యవేక్షిస్తారు. రేపు(బుధవారం) ట్రాఫిక్ మళ్లింపులను తెలుసుకు ఒటూ వాహనదారులు రాకపోకలు సాగించాలని ఈ సందర్భంగా అధికారులు విజ్ఞప్తి చేశారు. రహదార్లపై వాహనాలు నిలపడం, ట్రాఫిక్‌కి అంతరాయం కలిగించే విధంగా వ్యవహరించడం చేస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

- టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజా సూరిబాబురాజు
- శ్రీప్రకాష్‌లో ముగిసిన రాష్ట్రస్థాయి టీటీ ర్యాంకింగ్ పోటీలు



విజేతలకు బహుమతులను అందజేస్తున్న రాజా సూరిబాబురాజు

పెద్దాపురం, జూన్ 10: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబురాజు అన్నారు. కాకినాడ జిల్లా పెద్దాపురం శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ పోటీల ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతి ప్రధానం కార్యక్రమంలో ఆయన సోమవారం పాల్గొని మాట్లాడారు. చిన్నతనం నుంచి మంచి విద్యతోపాటు క్రీడలను భాగంగా చేసుకుని రోజూ నచ్చిన క్రీడలో సాధన చేయాలన్నారు. అంతర్జాతీయస్థాయిలో రాణించిన క్రీడాకారులకు క్రీడాకోటా ద్వారా మంచి ఉద్యోగాలు లభిస్తాయన్నారు. కాకినాడ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి కె.మోహన్‌బాబు మాట్లాడుతూ నేటికాలంలో విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, తల్లిదండ్రులు సైతం తమ పిల్లలకు క్రీడలను ప్రోత్సహించే విధంగా చూడాలన్నారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ తమ పాఠశాలలో ఇటువంటి క్రీడాపోటీలను నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. సాటిమేటి క్రీడాకారులకు తమ పాఠశాల వేదిక కావడం ఇంకా సంతోషాన్ని ఇస్తోందన్నారు. అనంతరం మెన్, ఉమెన్, బాయ్స్ విభాగంలో విజేతలకు రాజా సూరిబాబురాజు బహుమతులను అందజేశారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ విజయ్‌ప్రకాష్ చేతులమీదుగా రాజా సూరిబాబురాజును పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈకార్యక్రమంలో సెవెన్‌హిల్స్ పేపర్‌మిల్స్ చైర్మన్ పి.రాఘవారావు, తూతిక రాజు, చీఫ్ రిఫరీ రమణ, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో కాలుజారి ఉపాధ్యాయుడి మృతి



వాసిరెడ్డి మధుసూధనరావు(ఫైల్)

యానాం, జూన్ 10: యానాంలో ప్రమాదవశాత్తూ గోదావరిలో కాలుజారి వ్యక్తి మృతి చెందిన సంఘటన యానాం శివం హోలీబాత్‌వద్ద చోటుచేసుకుంది. యానాం గాజులవారివీధికి చెందిన వాసిరెడ్డి మధుసూదనరావు(మధు) ఆది వారం సాయంత్రం యానాం శివాంహోలీబాత్‌వద్ద గోదావరిలో స్నానానికి దిగి మునిగిపోయాడు. స్థానిక మత్స్యకారులు గాలింపు చర్యలు చేపట్టినప్ప టికీ ఆచూకీ లభ్యంకాలేదు. సోమవారం మధ్యా హ్నం బీచ్‌లో మదు మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ప్రస్తు తం మదు యానాం విద్యాశాఖలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

13న మండపేటలో రాష్ట్ర ఐఎఫ్‌టీయూ సమావేశం

మండపేట, జూన్ 10: ఈనెల 13న మండపేట పట్టణంలో నిర్వహించే ఐఎఫ్‌టీయూ రాష్ట్ర జనరల్ బాడీ కౌన్సిల్ సభను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు చెప్పారు. మండపేట ఏడిద రోడ్డులో వున్న ఆర్టీసీ బస్టాండ్‌వద్ద సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఐఎఫ్‌టీయూ కార్యదర్శి చీకట్ల, ఏఐకేఎంఎస్ ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా నాయకుడు వెంటపల్లి భీమశంకరం, పీడీఎస్‌యూ జిల్లా నాయకుడు బి.సిద్దు, ఐఎఫ్‌టీయూ నాయకుడు చింతా రాజారెడ్డి మాట్లాడారు. యాభై ఏళ్లుగా దేశంలో కార్మికవర్గాన్ని పోరాట మార్గంలో నడిపిస్తున్న ఇఫ్టూ అనేక పోరాటాలను చేస్తుందన్నారు. పోరాటాల సమయంలో అనేక మంది కార్మిక నాయకులను కోల్పోయిందని వారు చెప్పారు. కార్మికుల హక్కులకోసం మండపేటలో ఈనెల 13న జరిగే రాష్ట్రస్థాయి జనరల్‌బాడీ సమావేశంలో కార్యాచరణను రూపొందిస్తామన్నారు. సమావేశంలో మండపేట, రైస్‌మిల్లు జట్టుకార్మిక నాయకులు కె.సూరిబాబు, కె.సత్తిబాబు, కె.అన్నవరం, జి.నాగు, పి.సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు వేంకటేశ్వరరావు



సమవేశంలో మాట్లాడుతున్న నున్న తిరుమలరావు

జోసా-2024 అవేర్‌నెస్ ప్రోగ్రాం

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 10: మండలంలోని కాతేరులో తిరుమల విద్యాసంస్థల ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన జోసా-2024 అవేర్‌నెస్ కార్యక్రమానికి సుమారు 4వేల మంది విద్యార్థులు వారి తల్లిదండ్రులు హాజరయ్యారని విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. నిన్న ప్రకటించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారన్నారు. జోసా కౌన్సెలింగ్ ఏవిధంగా ఆప్షన్స్ పెట్టుకోవాలో, ఎలా పెట్టుకుంటే ఏ బ్రాంచ్‌లలో సీట్లు వస్తాయనే విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్, ప్రిన్సిపాల్, నన్నయ యూనివర్శిటీ ప్రొఫెసర్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హోటల్‌లోకి దూసుకెళ్లిన కారు

- బాలుడి మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు





హోటల్‌లోకి దూసుకెళ్లిన కారు, ప్రమాదంలో మృతి చెందిన బాలుడు

సామర్లకోట, జూన్ 10: కాకినాడజిల్లా సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవం గ్రామ బస్టాప్ వద్ద సోమవారం జరిగిన ప్రమాదంలో కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న హోటల్ పాకలోకి దూసుకెళ్లింది. పాకలో ఉన్న ముగ్గురు వ్యక్తులతో పాటూ మూడేళ్ల బాలుడు తీవ్ర గాయాలకు గురయ్యారు. సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రికి హుటాహుటిన చికిత్స నిమిత్తం తరలించినప్పటికీ మార్గమధ్యలోనే బాలుడు మృతి చెందినట్లు సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు నిర్ధారించారు. మరో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. సామర్లకోట ఎస్ఐ మౌనిక సంఘటనా స్థలాన్ని చేరుకుని ప్రమాదానికి గల కారణాలను, సమాచారాన్ని సేకరించారు. వివరాల్లోకి వెళితే పెదబ్రహ్మదేవం బస్టాప్ సమీపాన మలకల చక్రరావు, సత్యవతి దంపతులు హోటల్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారి మనుమడు అయిన తోటకూర సాయి సాత్విక్ వీర ప్రసన్న(3) కూడా ఉన్నాడు. ఆ సమయంలో బిక్కవోలు నుంచి సామర్లకోటకు వస్తున్న హోండాసిటీ కారు ఎదురుగా సామర్లకోట వైపు వెళుతున్న ఒక మోటార్‌సైకిల్‌ను తప్పించే ప్రయత్నంలో అదుపుతప్పి రోడ్డు పక్కన హోటల్‌లోకి దూసుకెళ్లింది. హోటల్‌లో ఉన్న చక్రరావు, సత్యవతి, బాలుడు సాత్విక్‌లను వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో బాలుడు సాత్విక్ మృతి చెందగా చక్రరావు, సత్యవతిలు గాయపడ్డారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను సామర్లకోట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మలకల వెంకటేష్ ఫిర్యాదు మేరకు సామర్లకోట పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మౌనిక తెలిపారు.



ఇటీవల ఘాటీ రోడ్లో నిలిచిపోయిన భారీ లారీ

అడ్డంకులే

- తరుచూ నిలిచిపోతున్న భారీ వాహనాలు
- ప్రయాణికులకు తప్పని అవస్థలు
- పట్టించుకోని అధికారులు

మోతుగూడెం, జూన్ 10: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో తులసిపాక నుంచి మారేడుమిల్లి మీదుగా రాజమహేంద్రవరం వెళ్లే ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. ముఖ్యంగా తులసిపాక మారేడుమిల్లి ఘాట్ రోడ్లో ప్రమాదాలకు నిలయంగా మారింది. అల్లూరి సీతారామరాజు జిల్లా మండలాలతోపాటు తెలంగాణా, ఛత్తీస్‌గడ్, ఒడిశా, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు వెళ్లడానికి ఈ రహదారి ఆధారం. ఈ రహదారిలో నిత్యం వాహనాల రద్దీ విపరీతంగా పెరిగిపోతుంది. తులసిపాక నుంచి రాజమహేంద్రవరం వెళ్లే ప్రధాన రహదారిలో మారేడుమిల్లి మండలం గుజ్జు, మామిడి వలస పంచాయతీ పరిధిలోని పాలమూరు నుంచి ఘాటీ రోడ్డు ప్రారంభం అవుతుంది. చింతూరు మండలం తులసిపాక వరకు 30 కిలోమీటర్లు విస్తరించి ఈ ఘాటి రోడ్లో అత్యంత ప్రమాదకరమైన మలుపులు వీటికి తోడు ఎత్తైన కొండలు, దట్టమైన అటవీ ప్రాంతాల్లో విస్తరించి ఉన్నాయి. ఈ మలుపుల్లో కనీసం రక్షణ గోడలు లేకపోవడంతో మరో ప్రక్క లోతైన లోయలు ఉండటంతో ఏ మాత్రం వాహనాలు అదుపు తప్పితే ప్రమాదాలకు గురువుతున్నాయి. కల్వర్టుకు కనీసం రక్షణ గోడలు లేకపోవడంతో మరింత ఇబ్బందిగా మారింది. మారేడుమిల్లి మీదుగా భద్రాచలం వరకు ఉన్న రహదారిని అంతరాష్ట్ర రహదారిగా గుర్తించడం పైగా నాలుగు రాష్ట్రాలకు ఇదే దగ్గర దారి కావడంతో భారీ వాహనాల రాకపోకలు విపరీతంగా పెరిగిపోయాయి. ఈ క్రమంలో తులసిపాక-మారేడుమిల్లి మధ్యలో ఉన్న ఘాట్ రోడ్లో తరుచూ భారీవాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. తాజాగా భారీ ట్రాలీ లారీ మలుపులో ఇరుక్కుపోవడంతో రెండు రోజులుగా ఘాటి రోడ్డుపై భారీ వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ మార్గంలో 15 మీటర్ల పొడవుతోపాటు 30 టన్నుల బరువుమించి వాహనాలకు రాకపోకలు అనుమతిని నిషేదిస్తూ గతంలో జిల్లా కలెక్టర్ ఆంక్షలు విధించారు. దీనికి సంబంధించి మారేడుమిల్లి శివారులో ఒక హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు. ఈ నిబంధనలను ప్రభుత్వశాఖలు పట్టించుకోకపోవడంతో ఇటువంటి దుర్భర పరిస్థితులు ఏర్పడుతున్నాయని పలు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఘాటీలో వాహనాలు నిలిచిపోవడంతో అవస్థలు పడుతున్న ప్రయాణికులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



జగ్గంపేట, జూన్ 10: వెంగాయమ్మపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి దుర్మరణం చెందాడు. గోకవరానికి చెందిన మందపాటి మణిరత్నం(30) గేదెల వ్యాపారం చేస్తుంటాడు. మోటారుసైకిల్‌పై స్నేహితుడితో కలిసి జగ్గంపేటలోని దూళ్ల సంతకు సోమవారం బయలుదేరాడు. మధ్యాహ్నం నుంచి గోకవరం వెళ్తుండగా వెంగాయమ్మపురం వద్ద ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. ఈ ఘటనలో మణిరత్నం ప్రాణాలు కోల్పోయాడు. కేసును జగ్గంపేట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మామిడికి భలే గిరాకీ

- టన్ను రూ.40వేలు




తుని రూరల్, జూన్ 10: మెట్టలో అధికంగా ఉద్యానవన పంటగా సాగవుతున్న మామిడికి ఈ ఏడాది మంచి గిరాకీ ఏర్పడింది. మెట్టలో ప్రధాన మార్కెట్‌లో నాణ్యతను బట్టి రూ.35వేలు నుంచి 40వేల వరకు భంగినపల్లిమామిడి అమ్ముడు అవుతుంది. ఆశించిన మేర మార్కెట్‌లోకి కాయలు రాకపోవడంతో రాజస్థాన్, యూపీ, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. 4రోజులక్రితం మార్కె ట్ దిగువ రేట్లకు ఉన్నప్పటికీ శుక్ర, శనివారం మా ర్కెట్లో మామిడికి ఒక్కసారిగా రేటు పెరిగింది. ఈ ఏడాది ప్రతికూల వాతావరణ పరిస్థితులు కారణంగా 10శాతం పంట దిగుబడి రాలేదు. దీంతో ఉన్న పంటకు మంచిగిరాకీ ఏర్పడినట్లు మెట్ట రైతులు తెలిపారు. గతేడాది భంగినపల్లికాయలు టన్నుకు గరిష్టంగా రూ. 10వేలు నుంచి రూ.15వేలు ధర మాత్రమే రావడంతో రైతులు దిగాలు పడ్డారు. ఈ ఏడాది రేట్లు 3రెట్లు పెరిగిన దిగుబడి లేకపోవడంతో వారు అందోళన వ్యక్తం చేస్తున్నారు.

సత్యనారాయణస్వామి
ఆలయ కమిటీ రాజీనామా

రాజమహేంద్రవరం కల్చరల్ జూన్ 10: వైసీపీ ఓటమి చెందడం.. నామినేటెడ్ పదవుల రద్దు కారణంగా ఆర్యాపురం శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానం పాలక మండలి సభ్యులు సోమవారం రాజీనామాలు సమర్పించారు. చైర్‌పర్సన్ దుంగా మంగ, డైరెక్టర్లు బల్లిపాటి శ్రీను, విశారపు కాశీ విశ్వనాథం, రఘుపాత్రుని సాయిబాబు, బసరబోయిన విజయశంకర్, సాగరాల దిలీప్ హర్ష, రేగుల అన్నపూర్ణ, చక్కాకుల వెంకట రమణి, సంసాని దుర్గ, పామడిపల్లి వీజీ, రవిబాబు రాజీనామా చేశారు. ఈ మేరకు ఈవో సత్యవేణికి సోమవారం రాజీనామా లేఖను అందజేశారు.

ఏజెన్సీ సమాచారం

డొంకరాయి జలవిద్యుదుత్పత్తి ప్రారంభం



డొంకరాయి జల విద్యుత్ కేంద్రం నుంచి విడుదలవుతున్న నీరు

మోతుగూడెం, జూన్10: పవర్ కెనాల్ మరమ్మతు పనులు పూర్తి కావడంతో డొంకరాయి జల విద్యుత్ కేంద్రంలో సోమవారం సాయంత్రం 6గంటల నుంచి యూనిట్ ద్వారా విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించారు. డొంకరాయి పవర్ కెనాల్ నిర్వహణ పనులు పూర్తి కావడంతో నిర్వహణా పనులు కోసం తీసుకున్న ఎల్‌సీ సోమవారం రిటన్ చేయడంతో గ్రిడ్ అధికార్లు నుంచి విద్యుత్ ఉత్పత్తికి ఆదేశాలు వెలువడిన నేపథ్యంలో సాయంత్రం 6గంటల 6 నిమిషాలకు జెన్‌కో అధికార్లు యూనిట్ వినియోగంలోకి తీసుకొచ్చారు. మొదటిగా 11.5 మెగావాట్ల లోడ్‌వేసి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించారు. ప్రస్తుతం పవర్ కెనాల్‌కు 8.5 అడుగుల నీరు వెళుతుందన్నారు. కెనాల్ నిర్వహణ పనుల నేపథ్యంలో మంగళవారం నాటికి అంచెలంచెలుగా నీటి విడుదలను పెంచుతామని జెన్‌కో అధికార్లు తెలిపారు. పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి చేయాలంటే ఫోర్‌బే వద్ద నీటి మట్టం పెరగాల్సి ఉంది. దీనికి మూడు గంటల సమయం పడుతుందన్నారు. ఫోర్‌బే వద్ద మూడుగంటల తరువాత నీటి మట్టం పెరిగినప్పటికీ గ్రిడ్ అధికార్లు నుంచి విద్యుత్ ఉత్పత్తి చేయాలని ఆదేశాలు వస్తేనే విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభిస్తామని జెన్‌కో అధికారులు తెలిపారు. ప్రస్తుతం డొంకరాయిలో 1016.4అడుగల నీటి మట్టం ఉందని, ఉన్న నీటి నిల్వలతో గ్రిడ్ అధికార్ల ఆదేశాల మేరకు సీలేరు కాంప్లెక్సులోని అన్ని జలవిద్యుత్ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని జెన్‌కో అధికార్లు తెలిపారు.

స్ఫూర్తి దాతలకు సత్కారం



ఆత్మీయ సమ్మేళనంలో స్ఫూర్తి దాతలను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

చింతూరు, జూన్10: రామన్నపాలెంలో సోమవారం కోయిత్తోర్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోయిత్తోర్ బాట సృష్టికర్తలు యాదయ్య, పాండు మాష్టార్లకు పూర్వ విద్యార్థులు సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ మన్యంలో ఆదివాసీ యువత కొన్నేళ్ల క్రితం చదువుకొనే స్తోమత లేకపోవడం, అదే దశలో చదువు ఆవశ్యకతపై అవగాహన లేకపోవడంతో చదువుకు దూరమయ్యే వారిని దీంతో వారి ఆర్థిక స్థితిగతులు ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉండేదన్నారు. ఈ క్రమంలో తెలంగాణాకు చెందిన యాదయ్య, పాండు మాస్టారు ఆదివాసీ యువతకు విద్య అందించేందుకు దృష్టి సారించారు. చింతూరు మండలం రామన్నపాలెంలో కొయితోర్ బాట అని నామకరం చేసి డ్రాప్ అవుట్ పాఠశాలలను ప్రారంభించారు. నాటి ఐటీడీఏల సహకారం కూడా తీసుకుని వసతి కూడా ఏర్పాటు చేశారు. దీంతో వివిధ ప్రాంతాలకు చెందిన ఆదివాసీ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం, తద్వారా వారిలో పలువురు వివిధ ప్రభుత్వశాఖలో ఉద్యోగం పొంది స్థిరపడ్డారు. ఇక్కడ చదువుకున్న వారు ఆదివాసీ వాడుక భాషలో పద్యాలు, కథలు రాస్తున్నారు. ఇవన్నీ గుర్తు చేసుకుంటూ పూర్వవిద్యార్థులు మాస్టారును ఘనంగా సత్కరిం చారు. ఇక్కడ చదువుకున్న వారిని, ఆపదలో ఆదుకునే క్రమంలో పూర్వవిద్యార్థుల విపత్తు నిధి కూడా ఏర్పాటు చేసుకునే దిశగా కార్యాచరణ రూపొందించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సోడే మురళి, భీమమ్మలతోపాటు పలువురు పూర్వ విద్యార్థులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

కూటమి విజయోత్సవ ర్యాలీ



విజయోత్సవ ర్యాలీలో పాల్గొన్న కూటమి నాయకులు

కూనవరం, జూన్10: రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అఖండ విజయం కారణంగా కూనవరంలో భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. వందలాది మంది కార్యకర్తలు ఈ ర్యాలీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఆధ్వర్యంలో ఈ ర్యాలీ జరిగింది. ఈసందర్భంగా ఆపార్టీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ అరాచక పాలన సాగించారని జగన్ పాలన విముక్తి అయిందని ఇక నుంచి పేద ప్రజలకు అన్ని రంగాల్లో సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్రాభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నోముల సత్యనారాయణ, రాజేష్, బొప్పన చందు, చెలకాని ఉమా మహేశ్వరరావు, హెచ్.రాము, గడ్డిపాటి ప్రసాద్, బాలకృష్ణ, జనసేన నాయకులు దాసరి నరేంద్ర, మేజర్ పంచాయతీ సర్పంచ్ హేమంత్, ఏలం శ్రీకాంత్, బీజేపీ నాయకులు పాయం వెంకయ్య పాల్గొన్నారు.

అతి ఉత్కృష్ట్ సేవాపథక్ అవార్డుకు ఎంపిక



ఎంపికైన హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు

దేవీపట్నం, జూన్ 10: దేవీపట్నం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ జి.శ్రీనివాసరావు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అతి ఉత్కృష్ట్ సేవాపథక్ అవార్డుకు ఎంపికైనట్లు ఎస్‌ఐ కె.నాగార్జున తెలిపారు. 2021-22లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారి కి రాష్ట్ర ప్రభుత్వం సేవా పథకాలు జాబితాను విడుదల చేయగా అందులో దేవీపట్నం పోలీస్‌స్టేషన్‌లో గత కొంతకాలంగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు ఎంపికయ్యారు. శ్రీనివాసరావు అవార్డు ఎంపిక కావడంతో ఎస్‌ఐ నాగార్జున, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

ఏపీఎంపై ఇచ్చిన ఫిర్యాదు ఉపసంహరణ

దేవిపట్నం, జూన్ 10: మండల మహిళా సమైక్య వెలుగు ఏపీఎం సూర్యపై ఇచ్చిన ఫిర్యాదు వెనక్కి తీసుకుంటున్నట్లు భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తెల్లం శేఖర్ అన్నారు. కొందరు ఇందిరా క్రాంతి పథకం సిబ్బంది తప్పుడు సమాచారం వల్ల అదే వాస్తవంగా భావించి ఫిర్యాదు చేశారని, అయితే సిబ్బంది మనస్పర్ధలవల్ల గొడవలన్నీ జరిగాయని తెలుసుకుని అవాస్తవంగా భావించి ఫిర్యాదు ఉపసంహరించుకున్నానన్నారు. వెలుగు సిబ్బంది నలుగురు సీసీలను వేరే మండలానికి బదిలీ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో రమేష్

గోపాలపురం, జూన్ 10: విధి నిర్వహణలో పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో కె.రమేష్ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తాగునీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణ, పారిశుధ్యం తదితర అంశాలపై పంచాయతీ కార్యదర్శులతో సోమ వారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలోనూ తాగునీటి ఎద్దడి రాకుండా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. వీధిలైట్లు, పారిశుధ్యం నిర్వహణ యుద్ధప్రతిపాదికన జరగాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కారణంగా వ్యాధులు ప్రబలకుండా మురుగునీటి నిర్వహణ చేపట్టాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సార్వాకు సిద్ధం



దేవరపల్లి: త్యాజంపూడిలో ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న దృశ్యం

- దమ్ములు చేసి నారుమడులు వేస్తున్న రైతులు
- సన్న రకాల సాగుకు మొగ్గుచూపుతున్న రైతాంగం

కడియం/నిడదవోలు/దేవరపల్లి, జూన్ 10: కడియం ఆవ ప్రాంతంతో పాటు వీరవరం, దామిరెడ్డిపల్లి, మాధవరాయుడుపాలెం, జేగురుపాడు, మురమండ, దుళ్ళ, వేమగిరి తదితర గ్రామాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. ఇప్పటికే రైతులు దమ్ము చేసి నారుమడులు చేసి వరివిత్తనాలు జల్లి ఆకుమడులకు సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది తొలకరి పంటకు గాను మండలంలో సుమారు 5 వేల ఎకరాల్లో రైతులు ఎంటీయూ 1318, ఎంటీయూ 7029 రకాలను సాగు చేస్తున్నారని వ్యవసాయ శాఖ అధికారి ద్వారకాదేవి తెలిపారు. నిడదవోలు పట్టణ మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 16,500 ఎకరాల్లో వరి సాగుకు రైతాంగం సమాయత్తమయ్యారు. మండలంలో సుమారు 50 ఎకరాలకు పైగానే నారుమడులు వేగవంతం అయ్యాయి. స్వర్ణ రకానికి చెందిన ఎంటీయూ 7029, సంపద స్వర్ణ టీఎల్‌పి 1100, ఎంటీయూ 1061, 1064 రకాల సాగుకు రైతులు సిద్ధమయ్యారు. దేవరపల్లి మండలంలో ఎనిమిది వేల ఎకరాల్లో వరి సాగుచేస్తున్నారు. ప్రధానంగా గౌరీపట్నం, దుద్దుకూరు, యర్నగూడెం, సంగాయిగూడెం, త్యాజంపూడి గ్రామాల్లో వరి సాగు చేస్తుంటారు. ప్రధానంగా స్వర్ణ, పీఎల్ 1100, ఎల్‌పీ 1318, ఎంపీ 1061, ఎంపీ 1064 రకాలు వరినారు రైతులకు మడులు కట్టారని దేవరపల్లి మండల ఏవో కే.విజయ్ తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే సకాలానికి రుతుపవనాలు రావడం, అడపాదడపా వర్షాలు పడడంతో రైతులు వరినాట్లకు అవసరమైన ఆకుమడులను సిద్ధం చేస్తున్నారు.



త్యాజంపూడిలో దమ్ము



నిడదవోలు మండలంలో నారుమడి

ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు



రాజానగరం: సూర్యారావుపేటలో కేక్ తినిపిస్తున్న బీవీఆర్ చౌదరి

రాజానగరం, జూన్ 10: హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను మండల నందమూరి యువసేన అధ్యక్షుడు పాతూరి నవీన్‌చౌదరి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. సూర్యారావుపేటలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి ముఖ్యఅతిథిగా విచ్చేసి కేక్‌ను కట్‌చేసి అభిమానులకు తినిపించారు. సినీ, రాజకీయ రంగాల్లోనే కాకుండా సమాజ సేవా కార్యక్రమాల్లోనూ బాలకృష్ణ ఎంతో ప్రజాదరణ పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో నందమూరి యువసేన పార్లమెంటు ప్రధాన కార్యదర్శి అట్లూరి రాజేష్, మార్గాని రామకృష్ణ, తెల్లమేకల వీరబాబు, టీడీపీ నాయకులు గంగిశెట్టి చంటిబాబు, కందుల బాబూరాయుడు, వంక మల్లిబాబు, కొల్లం రత్నం, బత్తుల త్రిమూర్తులు, నీలపాల అరవరాజు పాల్గొన్నారు.

కోరుకొండ: కోరుకొండ అల్లూరి సీతారామరాజు జంక్షన్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణచౌదరి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తనకాల నాగేశ్వరరావు, దాశెట్టి శ్రీనివాస్, కర్రి పెంటాజీ, డి.సుబ్రహ్మణ్యం, గుర్తుర్తి రవిబాబు, ఉప్పలపాటి వీరాస్వామి, కొయ్యాశామ్యూల్, కొచ్చెర్ల చిన్నారావు పాల్గొన్నారు.

రంగంపేట: వడిశలేరులో దండుగంగమ్మ గుడి యూత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవింద్ టీడీపీ జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. స్వీట్స్ పంచి బాణసంచా కాల్చారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వడిశలేరులో టీడీపీకి అధిక మెజారిటీ రావటానికి కృషి చేసిన దండుగంగమ్మ గుడి యూత్‌కు, టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఎస్టీరాజాపురంలో బాలకృష్ణ జన్మదిన వేడుకలు జరిపారు. కార్యక్రమంలో వెలుగుబంటి సత్తిబాబు, ఉద్దండ్రావు శ్రీను, పోతుల వెంకట్రావు,మాచిన వెంకన్నదొర, సేవ శ్రీను, ఉప్పలపాటి బులిదొర, బద్దె వరప్రసాద్, ఆళ్ల రామకృష్ణ పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన నల్లమిల్లి





ఢిల్లీలో పురందేశ్వరి సహా పలువురిని కలిసిన నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, జూన్ 10: ఈనెల 12న ఏపీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న టీడీపీ అధినేత చంద్రబాబును సోమవారం ఎమ్మెల్యే విజేత నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఢిల్లీలో మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారానికి ఢిల్లీ వెళ్లిన ఇద్దరు నేతలు అక్కడ కలుసుకు న్నారు. ఈ సందర్భంగా చంద్రబాబును సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేగా ఎన్నికైనందుకు చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఢిల్లీ లో కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహననాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్‌తోపాటు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి శివప్రకాష్‌జీని నల్లమిల్లి మ ర్యాద పూర్వకంగా కలిశారు. ఎంపీ పురందేశ్వరి, వెంకటేశ్వరరావు దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రులను సత్కరించి శుభాకాం క్షలు తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించినట్టు తెలిపారు. నల్లమిల్లి వెంట బీజేపీ నాయకుడు టి.రామకృష్ణారెడ్డి తదితరులున్నారు.

రామోజీరావుకు ఏపీయూడబ్ల్యూజే నివాళి

అనపర్తి, జూన్ 10: పత్రికా రంగంలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టి అనేక సంచలనాలు సృష్టించిన రామోజీరావు కృషి మరువలేనిదని ఏపీయూడబ్ల్యూజే అనపర్తి ప్రతినిధులు అన్నారు. సోమవారం అనపర్తిలోని ప్రెస్‌క్లబ్ ఆవరణలో నిర్వహించిన సంతాప సభలో రామోజీ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జర్నలిస్టులు దుర్గా శ్రీరామమూర్తి, వీవీఎస్ సూర్యనారాయణ, కర్రి శ్రీనివాసరెడ్డి (బుజ్జి), సత్తి శ్రీనివాసరెడ్డి, రెడ్డి గోపాలకృష్ణ, గురవయ్య, టీడీపీ నాయకులు కర్రి వెంకటరామారెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, బాసి, ఈ.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రాజమండ్రిలో రామోజీరావు విగ్రహం ఏర్పాటు చేయాలి

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 10: రామోజీరావు విగ్రహాన్ని రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సానబోయిన రామారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. తిలక్‌రోడ్డులోని సంఘం కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి బీసీ సంక్షేమ సంఘం నాయకులతో కలిసి సోమవారం నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ముప్పిడి గంగాధర్, బత్తిన ప్రసాద్, కార్యదర్శి గోర్సా తాతబ్బాయి యాదవ్, బత్తిన ఏడుకొండలు, బొక్కా సత్యవెంకటప్రతాప్ పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న బలభద్రపురం వాసులు



బిక్కవోలు, జూన్ 10: రాష్ట్రంలో మరలా సీఎంగా చంద్రబాబు, ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి గెలుపొందితే గౌరిపట్నం వస్తామని బలభద్రపురం ఎస్సీ పేట వాసులు మొక్కుకున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇద్దరూ గెలుపొందడంతో స్థానిక నాయకుడు నేదూరి చిన్న ఆధ్వర్యంలో సోమవారం వారందరూ లారీలో మొక్కు చెల్లించుకోడానికి గౌరీపట్నం వెళ్లారు. వారికి నాయకులు నల్లమిల్లి సుబ్బారెడ్డి, చిన్నం వీర్రాఘవరెడ్డి, మల్లిడి కనకప్రసాద్ రెడ్డి, ఎస్సీ పేట పెద్దలు వీడ్కోలు పలికారు.

వైభవంగా అంకాలమ్మ గ్రామోత్సవం

కోరుకొండ, జూన్ 10: కోరుకొండ గ్రామదేవత అంకాలమ్మ గ్రామోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. నూతనంగా తయారు చేసిన రథంలో అమ్మ వారిని ఆశీనులను చేసి మంగళవాయిద్యాలు, బాణసంచా కాల్పుల మధ్య గ్రా మంలో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు మొక్కులు చెల్లించారు. సా యంత్రం ఆలయం వద్ద మేకపోతు సిరి తిప్పారు. కార్యక్రమంలో మాజీ స ర్పంచ్ తాటికొండ రామచంద్రరావు, తాటికొండ బుజ్జి, వాకా నరసింహారావు, మాతా సీతారాముడు, మాతా ప్రభు, కోడినాగుల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముద్రగడ ప్రకటనపై స్పందించాలి

టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి వెంకటరామారెడ్డి

అనపర్తి, జూన్ 10: సార్వత్రిక ఎన్నికల్లో పిఠాపురం అభ్యర్థిగా పోటీ చేసిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను ఓడించలేక పోతే తన పేరును ముద్రగడ పద్మనాభరెడ్డిగా మార్చుకుంటానని ప్రకటించి, ఓడించలేక తన పేరు చివర రెడ్డి చేర్చుకుంటున్నానని ముద్రగడ ప్రకటించి నాలుగు రోజులైందని, కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం ప్రకటన చేయాలని టీడీపీ సీనియర్ నాయకుడు కర్రి వెంకటరామారెడ్డి అన్నారు. ఇటువంటి నిలకడలేని నాయకులు రెడ్డిగా పేరు మార్చుకుంటే రెడ్ల పరువు పోతుందని దీనిపై సంఘ పెద్దలు స్పందించి ప్రకటన చేయాలన్నారు. ముద్రగడకు రెడ్డి జాతి అంటే అంత లోకువగా ఉందని ఆయన విమర్శించారు.

పాస్టర్ ఫెలోషిప్ సమావేశం

వైద్య శిబిరంలో పలువురికి పరీక్షలు

కడియం, జూన్ 10: మండలంలోని దామిరెడ్డిపల్లిలో సోమవారం ఫెలోషిప్ చీఫ్ ప్యాట్రన్ సభ్యుడు డి.రత్నరాజు ఆధ్వర్యంలో పాస్టర్ ఫెలోషిప్ సమావేశంతో పాటు, రత్నరాజు తండ్రి అర్లపరాజు పేరిట డెల్టా ఆస్పత్రి వారితో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. సేవకులకు డి.ఫ్రాన్సిస్ బహుమతులు అందించారు. అలాగే బీపీ, షుగర్‌తో పాటు పలు రకాల వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ముద్రగడ జెమీ, ఎంపీటీసీ విత్తనాల సాయి, రంపం గోపాలకృష్ణ, గాజుల రత్తయ్య, షేక్ సిద్ద, పాల్గొన్నారు. ఫెలోషిప్ ప్రెసిడెంట్ ఎం.కరుణాకర్, డి.పరంజ్యోతి, కె.జయశీల్, బిషప్ రైన్‌హార్డ్, రత్నదీప్, వీఎస్‌సీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అస్సైన్డ్ భూబదలాయింపు నిషేధ చట్టం రద్దు చేయాలి

అయినాపురపు సూర్యనారాయణ

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 10 : గత వైసీపీ ప్రభుత్వం చేసిన అసైన్డ్ భూబదలాయింపు నిషేధ చట్టం 9/77ను చంద్రబాబు రద్దు చేయాలని అఖిల భారత పార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి అయినాపురపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు.స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం రద్దుచేసిన 27 ఎస్సీఎస్టీ పథకాలను తిరిగి పునరుద్ధరించాలని కోరారు. చంద్రబాబు సీఎం పదవి చేపట్టిన వెం టనే అసైన్డ్ భూబదలాయింపు నిషేధ చట్టం రద్దుచేయాలని విజ్ఞప్తి చేశారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో కొత్త భూసేకరణ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలన్నారు. రంపచోడవరం కేంద్రంగా మరొక జిల్లాను ప్రకటించాలని, ఎస్సీఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ఈ సమావేశంలో పిట్టా వరప్రసాద్, యార్లగడ్డ శ్రీనివాసరావు, ఎస్.వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కాపు రాక్స్ బృందానికి యర్రా వేణు అభినందన

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 10: కూటమి విజయానికి శ్రమించిన కాపు రాక్స్ బృందాన్ని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యర్రా వేణుగోపాలరాయుడు అభినందించారు. రాజమహేంద్రవరంలో యర్రావేణు కార్యాలయంలో పడాల చక్రీ ఆధ్వర్యంలో కూటమి అభ్యర్థుల విజయానికి పనిచేసిన కాపు రాక్స్ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు.

ఎర్రపోతవరం ఘటనకు కేవీపీఎస్ నిరసన

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 10: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా గంగవరం మండలం ఎర్రపోతవరంలో అంబేడ్కర్ విగ్రహానికి చెప్పుల దండవేసి అవమానించిన దుండగులను కఠినంగా శిక్షించాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరంలో గోకవరం బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు జువ్వల రాంబాబు, దళిత నాయకుడు దువ్వాడ రాజా నిరసన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీల కక్షలతో అంబేడ్కర్‌ను అవమానిస్తున్నారన్నారు.

పార్కు ఆర్చ్ కూల్చేసిన బ్లేడ్‌బ్యాచ్

రాజమహేంద్రి పరిరక్షణ సమితి అధ్యక్షుడు టీకే

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 10: పార్టీలకతీతంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన మునిసిపల్ కాలనీ పార్కులో అసాంఘిక శక్తులు పేట్రేగి పార్కు మెయిన్‌గేట్ ఆర్చ్‌ను కూల్చివేశాయని రాజమహేంద్రి పరిరక్షణ సమితి అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మునిసిపల్ కాలనీ పార్కులో సోమవారం విలేకరులతో మాట్లాడారు. మునిసిపల్ కాలనీ పార్కులో చేరుతున్న గంజాయి,బ్లేడ్ బ్యాచ్‌ల ను మందలించడంతో కక్షగట్టి ఆర్చ్‌ని కూల్చివేసి ఈ నేపం టీడీపీపైకి నెట్టేవిధంగా ఆ పార్టీ జెండాలను పార్కులో కట్టారన్నారు. దీనిపై త్రీటౌన్‌లో ఫిర్యాదు చేశామని చెప్పారు. సీఐ స్పదించి చర్యలు తీసుకుంటామని చెప్పారన్నారు. సమావేశంలో గారపాటి విశ్వనాథం, జాలా నటరాజ్, పినిశెట్టి సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

పది మహిళా సంఘాలకు రూ.73 కోట్ల బ్యాంకు రుణాలు: ఏపీఎం



వీవోలతో సమీక్ష నిర్వహిస్తున్న ఏపీఎం జయంతిరాజు

కోరుకొండ, జూన్10: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మండలంలోని 1306 మహిళా శక్తి సంఘాలకు పది బ్యాంకు శాఖల ద్వారా రూ.73,54,78,000 బ్యాంకు రుణాలుగా అందజేశామని ఏపీఎం జయంతిరాజు తెలిపారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సోమవారం గ్రామైక్య సంఘాల బీవోఏలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంక్ ఆఫ్ బరోడా కోరుకొండ శాఖ ద్వారా రూ.6.16 లక్షలు, బూరుగుపూడి శాఖ ద్వారా రూ.23 లక్షలు, గాదరాడ బ్యాంకు ద్వారా రూ.26.71 లక్షలు, శ్రీరంగపట్నం బ్యాంకు ద్వారా రూ.18.43 లక్షలు, గాడాల చైతన్యగోదావరి గ్రామీణ బ్యాంకు ద్వారా రూ.4,35,66,000, శ్రీరంగపట్నం శాఖ ద్వారా రూ.22,57,44,000, స్టేట్ బ్యాంక్ శాఖ ద్వారా రూ.11,07,84,000, తొర్రెడు శాఖ ద్వారా రూ.6,58,39,000, మిర్తిపాడు శాఖ ద్వారా రూ.1.60 కోట్లు, పశ్చిమగోనగూడెం యూనియన్ బ్యాంక్ ద్వారా రూ. 24,66,10,000 వివిధ మహిళా స్వయం సహాయ సంఘాలకు రుణాలుగా అందజేశామన్నారు. అలాగే ఆసరా పథకం కింద కోరుకొండ మండలంలోని 20 గ్రామాల్లో 1569 మహిళా స్వయం శక్తి సంఘాల్లోని 15690 మంది మహిళలకు రూ.14,54, 06,594 సహాయం అందజేసినట్టు ఏపీఎం జయంతిరాజు తెలిపారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో లారెల్ హైకు ఉత్తమ ర్యాంకులు








రాజమహేంద్రవరం సిటీ, జూన్ 10: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తొలిప్రయత్నంలో రాజమహేంద్రవరంలోని లారెల్ హై గ్లోబల్ స్కూల్ విద్యార్థులు అద్భుత విజయం సాధించారని డైరెక్టర్ రవికుమార్ సుంకర తెలిపారు. తమ పాఠశాల నుంచి 21మంది విద్యార్థులు అర్హత సాధించారని తెలిపారు. గోరిపర్తి సాయి కృష్ణ(3504), బి.యశ్వంత్(4368), పి.హర్షిత(153 88), ముమ్మాలా సైలేష్(16721) వివిధ కేటగిరీల్లో ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. నలుగురు విద్యార్థులు ఐఐటీలో చదువుకునే అవకాశం లభిస్తుందని రవికుమార్ అన్నారు.

టెన్త్ విద్యార్థులకు సత్కారం

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 10: ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల నుంచి జిల్లాస్థాయిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను యూటీఎఫ్ జిల్లాశాఖ సత్కరించింది. ఈ మేరకు సోమవారం రాజమహేంద్రవరంలోని ఎల్‌ఐసీ యూనియన్ భవనంలో సత్కరించారు. జిల్లా స్థాయిలో 591 మార్కులు సాధించిన బొమ్మూరు జీపీఆర్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.తేజశ్విని, 581 మార్కులు సాధించిన పందలపాక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థిని కానూరి దివ్యశ్రీలను జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.జయకర్, ఏ.షరీఫ్, రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి, ఉపాధ్యక్షుడు రాంబాబు, విజయగౌరీ పాల్గొన్నారు.





డీసీసీబీ సభ్యుల రాజీనామాలేవి?

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 9 : నామినేటెడ్ పదవులు రద్దు చేస్తూ ప్రభుత్వం ఈ నెల 7వ తేదీన ఉత్తర్వులు జారీచేసింది. అయితే జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు పాలకవర్గం మాత్రం నేటికి తమ రాజీనామా పత్రాలను సమర్పించలేదు. కమిటీలో ఛైర్మన్‌తో పాటు ఆరు గురు సభ్యులు ఉంటారు. రాజీనామాల వ్యవహారంపై కోఆపరేటివ్ బ్యాంకు అధికారులను వివరణకోరగా ప్రభుత్వ ఉత్తర్వులు 7వ తేదీన వచ్చాయని శనివారం, ఆదివారం సెలవు దినాలు కావడంతో సోమవారం రాజీనామా పత్రాలు సమర్పిస్తారని చేశారు.ఇదిలా ఉండగా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల ఛైర్‌పర్సన్లు, పర్సన్ ఇన్చార్జ్‌లు(త్రీమెన్ కమిటీ) తమ రాజీనామా పత్రాలను ఆయా సంఘాల సీఈవోల ద్వారా కోఆపరేటివ్ డిప్యూటీ రిజిస్ట్రార్‌కు పంపించారు. తక్షణమే వాటిని ఆమోదించినట్టు తెలిసింది. వైసీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి సొసైటీలకు ఎన్నికలు నిర్వహించకుండా నామినేటెడ్ కమిటీల ద్వారా నడిపించారు.ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 305 పీఏసీఎస్‌లు ఉన్నాయి.


పుస్తకాలను పరిశీలిస్తున్న డీఈవో వాసుదేవరావు

స్టూడెంట్ కిట్స్ సిద్ధం చేయండి : డీఈవో

రంగంపేట,జూన్ 10 : పాఠశాలలు తెరిచేనాటికి స్టూడెంట్ కిట్స్ సిద్ధం చేయాలని డీఈవో కె.వాసుదేవరావు సూచించారు. రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న స్టూడెంట్ కిట్స్ స్టాక్ పాయింట్‌ను సోమవారం ఆకస్మికంగా సందర్శించి మాట్లాడారు. పాఠ్య పుస్తకాలు 29,929, నోటు పుస్తకాలు 27,772, బెల్ట్‌లు 2501 నిల్వ కేంద్రంలో ఉన్నాయని ఎంఈవో పి.మధుసూదనరావు చెప్పారు. మిగిలిన సామగ్రి కూడా ఈ వారంలోగా అందజేయడానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్ఎంటీలు దుర్గారావు, సూర్యనారాయణ,శ్రీనివాసరాజు,ఐఆర్‌టి ప్రసాద్, పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్స్, వెంకటేశ్వర్లు, మూర్తి, చిన్నారావు, బూరిబాబు, ప్రసన్న, శ్రీలక్ష్మీలక్ష్మి, భవాని, రుద్రయ్య, నాగరాజు పాల్గొన్నారు.

ఫ్యాన్ గాలివీయక..లబోదిబో

నిండా మునిగిన పందెగాళ్లు

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 10 : పాలకుల నిర్వాకంతో పందెంరాయుళ్ళు లబోదిబోమంటున్నారు. ఎన్నికలు వచ్చాయంటే మా పార్టీ గెలుస్తుందని ఒకరు.. తమ పార్టీ గెలుస్తుందని మరొకరు పందేలు కాసుకుంటారు. అయితే ఈ సారి ఓడిపోతుందని తెలిసి కూడా పందాలు వేసి చేతులు కాల్చుకున్నారు. వైసీపీ అత్యుత్సాహంతో నాయకులు, కార్యకర్తలు నాశనమైపోయారు. మనం గెలుస్తాం అంటూ అటు జగన్.. ఇటు నాటి మంత్రులు విపరీతమైన ప్రకటనలు చేశారు. దీంతో కొంత మంది వైసీపీ నాయకులు.. కార్యకర్తలు పెద్ద ఎత్తున పందాలు కాశారు. అధికారులు కూడా పందాలు కాసి చేతులు కాల్చుకున్నట్టు తెలుస్తుంది. ఎన్నికలైన రెండు రోజుల వరకు పందాల కోసం ఊగిన పందెంరాయుళ్ళు ఆ తరువాత సీన్ అర్థమై ఆగిపోయారు. రెండు రోజుల్లో ఫలితాలు వస్తాయనగా మరలా ఊగారు. రాజానగరం నియోజకవర్గం పరిధిలో కొంత మంది అధికారులే వైసీపీ విజయం సాధిస్తుందంటూ పందాలు వేయటమే కాకుండా కొంతమందిని ప్రోత్సహించినట్టు తెలుస్తుంది. గ్రామాల వారీ మెజారిటీలపై కూడా కోట్లలో పందాలు కాసి వైసీపీ నాయకులు, కార్య కర్తలు మునిగిపోయారు. రూరల్ నియోజకవర్గం పరిధిలో కూడా గ్రామాల్లో మెజారిటీలపై భారీగా పందాలు జరిగాయి. బంగారం తాకట్టు పెట్టి మారీ పందాలు కాసి చేతులు కాల్చుకున్నారు. కొంతమంది తెలివైన వైసీపీ నాయకులు మాత్రం కూటమి అభ్యర్థులపై పందాలు కాసి సొమ్ములు చేసుకున్నారు. ఏది ఏమైనా పాలకుల పుణ్యమో అంటూ క్యాకర్తలు, అమాయకుల సొమ్ములు కోట్లలో ఆవిరైపోయాయి.

సెంట్రల్ జైలు నుంచే..


చంద్రబాబు ప్రమాణస్వీకార ఏర్పాట్లు

సెంట్రల్ జైలు వద్ద మాట్లాడుతున్న పవన్ (ఫైల్)

గెలుపు..మలుపు..

రేపు చంద్రబాబు ప్రమాణ స్వీకారం

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఓటమే విజయానికి నాంది పలుకుతుంది.. కష్టమే గెలవాలనే దారిచూపుతుంది.. కూటమి విజయమే అందుకు ఉదాహరణ..2019లో టీడీపీకి వచ్చినవి కేవలం 23 సీట్లు.. అది రాజకీయ ఓటమి..ఆ తరువాత ఎన్నో అవమానాలు.. ఎన్నో కుట్రలు అన్నీ తట్టుకుని నిలబడ్డారు చంద్రబాబు..ఆనాడే అసెంబ్లీలో శపథం చేశారు.. మళ్లీ ముఖ్యమంత్రిగానే అసెంబ్లీలో అడుగుపెడతానని.. అయినా జగన్ వదల్లేదు.. మరింత కుంగదీయాలని సెంట్రల్ జైలులో పెట్టారు.. టీడీపీకి పెద్ద కష్టం..ఆ కష్టం నుంచి ఎలా బయటపడాలి.. అపర చాణక్యుడు చంద్రబాబు ఆ కష్టం నుంచే గెలుపునకు బాటలు వేశారు.. పవన్‌ను రంగం లోకి దించారు..సెంట్రల్ జైలు బయట పవన్ కల్యాణ్ ఇక్కడి నుంచే వైసీపీ పతనం ఆరంభ మైందని ప్రకటించారు. వైసీపీ అరాచకపాలన అంతానికి అంకురార్పణ చేశారు.. ఏకంగా 164 సీట్లు సాధించారు.అటు చంద్రబాబు చేసిన శప థం నెరవేరింది..ఇటు పవన్ కల్యాణ్ చేసిన హెచ్చరిక నిజమైంది..దీంతో బుధవారం చంద్రబాబు సీఎంగా ప్రమాణస్వీకారం చేయనున్నారు.

సెప్టెంబరు 14న పవన్ ప్రకటన..

గతేడాది చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో బంధించిన విషయం తెలిసిందే. జగన్ తన పత నానికి తానే నిప్పు పెట్టుకున్న రోజు అదే. ఢిల్లీ నుంచి గల్లీ వరకూ చంద్రబాబుకు సంఘీభావం వెల్లువైంది. జనసేనాని పవన్ కల్యాణ్ 2023 సెప్టెంబరు 14న రాజమహేంద్రవరం వచ్చి చంద్రబాబును జైలులో పరామర్శించారు. తర్వాత జైలు బయట మీడియా సమావేశంలో రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయం, ఆవేదనలో మునిగిపోయిన ప్రజల గురించి ఏకరువు పెట్టారు. చంద్రబాబును జైలులో పరామర్శించి వచ్చిన తర్వాత రాష్ట్ర క్షేమం కోసం వెన్నుదన్నుగా నిలవాలని నిర్ణయించుకున్నారు.జనసేన, తెలుగుదేశం కలిసి వెళతాయ్' అని ప్రకటించారు.రాసి పెట్టుకో జగన్ అరాచక పాలనకు అంతం తప్పదంటూ హెచ్చరించారు. రాష్ట్రానికి మళ్లీ మంచి రోజులు రావడానికి ఆ క్షణమే మౌన సాక్ష్యంగా నిలిచింది.పవన్ కల్యాణ్ టీడీపీతో పొత్తు ప్రకటించిన తర్వాత ఇటు టీడీపీ, జనసేన అటు బీజేపీ శ్రేణుల్లో ఎలాంటి అంతర్గత ఇబ్బందులూ రాకుండా సమతూకంగా ముందుకు నడిచారు. జన సైనికులకు ఎప్పటికప్పుడు మార్గనిర్దేశం చేస్తూ ఎక్కడా పొరపొచ్చాలు లేకుండా టీడీపీ, బీజేపీ వారితో కలిసి జనసేన నడవడంలో చారిత్రాత్మకమైన పాత్ర పోషించారు. సీట్ల పంపకాల విషయంలో చెలరేగిన కొద్దిపాటి అలజడినీ శాంతి ఒపజేశారు. 'ఎక్కడ నెగ్గాలో కాదు..ఎక్కడ తగ్గాలో' చేతల్లో చూపించి రాష్ట్రాన్ని చీకటి నుంచి మళ్లీ వెలుగుల్లోకి తీసు కురావడానికి ఊతమై నిలి చారు. చివరికి ఓటరు తీర్పు సునామీలో జగన్ కొట్టుకుపోయేలా చేశారు. రేపు చంద్రబాబు సీఎంగా ప్రమాణస్వీకారం చేయనున్నారు.

- జైలు వద్ద కలిసిన పొత్తు
- జనసేన అధినేత ప్రకటనతో మార్పు
- జగన్ పతనం ఆరంభమన్న పవన్
- కూటమి అఖండ విజయం
- ఫలించిన చంద్రబాబు శపథం
- రేపు కేసరపల్లికి జనం
- లక్షలాదిగా వెళ్లేలా ఏర్పాట్లు
- నియోజకవర్గానికి 4 బస్‌లు
- ఆహారానికి ప్రత్యేక పాయింట్లు
- జిల్లాలో 29 చోట్ల స్ర్కీన్లు

జిల్లాలో 29 చోట్ల స్ర్కీన్స్ ఏర్పాటు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

కూటమి నాయకులు ఆనందంలో మునిగి తేలుతున్నారు. చంద్రబాబు నాల్గో సారి ముఖ్యమంత్రిగా బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో పెద్ద ఎత్తున సంబరాలు చేసేందుకు సన్నద్ధమవున్నారు.ఆ మహోత్సవానికి కూటమి శ్రేణులు, అభిమానులు ప్రజలు తరలి వెళ్లనున్నారు.చంద్రబాబు నాయుడు ఈ నెల 12న ప్రమాణస్వీకారం చేయడాన్ని ప్రజలంతా ప్రత్యక్షప్రసారం ద్వారా చూసేందుకు ఏర్పాట్లను అధికార యంత్రాంగం చేస్తుంది. ఇప్పటికే ఏర్పాట్లపై చీఫ్ సెక్రటరీ నీరబ్ కుమార్ అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలిచ్చారు. ముఖ్యంగా ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి జిల్లాల నుంచి పెద్దఎత్తున ప్రజలు చంద్రబాబు ప్రమాణస్వీకారాన్ని తిలకించేందుకు వెళ్ళనున్నారు.ఈ మేరకు నియోజకవర్గం నుంచి 4 బస్సులు చొప్పున ఏర్పాటు చేస్తున్నారు.వారికి మార్గమధ్యంలో అల్పాహారం ఏర్పాటు చేస్తున్నారు.ప్రమాణస్వీకారోత్సవానికి వెళ్ళలేని వారికోసం మండలాల్లో డిజిటల్ స్ర్కీన్స్ ఏర్పాటు చేసి ప్రత్యేక ప్రసారం ద్వారా చూసే అవకాశం కల్పిస్తున్నారు.జిల్లా కలెక్టరు, అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించి పూర్తి చేస్తున్నారు. కృష్ణా జిల్లా గన్నవరం మండల పరిధి కేసరపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకార మహోత్సవ సభా వేదిక వద్దకు లక్షలాది మంది ప్రజలు తరలివెళ్లనున్నారు. మరికొందరు స్వచ్ఛందం బస్సులు, ఇతర వాహనాలపై వెళ్లేందుకు స్వచ్ఛందంగా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా ప్రజలు చూడడం కోసం జిల్లాలో 29 చోట్ల డిజిటల్ స్ర్కీన్స్ ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా కలెక్టర్ మాధవీలత తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలకు లైటింగ్ ఏర్పాటుచేయాలని ఆదేశించారు. చంద్రబాబును విజయవాడలో సోమవారం అనపర్తి ఎమ్మెల్యే విజేత నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పా రావు మర్యాదపూర్వకంగా కలిసి అభినందలు తెలిపారు.



చంద్రబాబుకు అభినందన

చంద్రబాబు నాయుడు బుధవారం ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు.. ఈ మేరకు పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శాలువా కప్పి చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు బుద్ధుడి విగ్రహాన్ని అందించి అభినందనలు తెలిపారు. జిల్లాకు చెందిన పలువురు నాయకులు సోమవారం ఆయనను కలిశారు.



నిలిచిన మీ సేవలు

10 రోజులవుతున్నా పనిచేయక నిర్వాహకుల ఇక్కట్లు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 10 : ఐటీ సర్వర్లు హోల్డ్‌లోకి వెళ్లడంతో ఎక్కడికక్కడ మీసేవల్లో సేవలు నిలిచిపోయాయి. విజయవాడ ఎస్‌డీసీ డాటా సెంటర్‌లో సర్వర్ల సమస్య, నెట్ వర్క్ ఇష్యూలతో రాష్ట్రంలో మీసేవలు బంద్ అయ్యాయి. గత ఐదేళ్లుగా మీ సేవల నిర్వాహకులు చాలా ఇబ్బందులు పడ్డారు. ఎందుకంటే సచివాలయాల ద్వారా కొన్ని సేవలను చేయడంతో మీసేవలకు వివిధ సర్వీసులు అందించే అవకాశం లేకుండా నిర్వహణ కష్టతరమైంది. ఎలక్షన్ నోటిఫికేషన్ విడుదలయ్యాక మీసేవల వద్ద ప్రజలు వివిధ సేవలకు క్యూకట్టారు. అప్పట్లో ముఖ్యమంత్రి జగన్ ఫొటోతో ఉన్న సర్టిఫికెట్లు నిలుపుదల చేసి రాజదముద్రతో సర్టిఫికెట్లు జారీ మొదలు పెట్టారు. కేవలం వారం రోజులు మాత్రమే ఈ విధమైన సేవలందించారు. పరిస్థితి సాధారణ స్థితికి చేరుకుందనుకునేలోగా విజయవాడలో ఐటీ, ఏపీ ఫైబర్ నెట్ కార్యాలయంపై ప్రభుత్వ తనిఖీలు చేపట్టడంతో ఐటీ సర్వర్లు హోల్డ్‌లోకి వెళ్లాయి. ఫలితంగా మీసేవలో సేవలు ఆగాయి. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ,ప్రైవేట్ నిర్వహణలో సుమారు 400పైబడి మీసేవ కేంద్రాలు ఉన్నాయి.గత ఐదేళ్లుగా ప్రభుత్వ నిర్వహణలో ఉన్న సెంటర్లు మినహా, నిరుద్యోగులు ఉపాధి కోసం ప్రైవేట్‌గా ఏర్పాటు చేసుకున్న మీ సేవ సెంటర్లు మాత్రం తీవ్రమైన సంక్షోభంలో ఉన్నాయి. అనేక సేవలు సచివాయలకు బదలాయించడంతో మీసేవ కేంద్రాలు వెలవెలబోయాయి. ఎన్నికల్ కోడ్ అమల్లోకి వచ్చాక కాస్తఊరట చెంది సర్వీసులు అందిస్తున్న మీసేవ నిర్వాహకులకు ఇప్పుడు ఐటీ హోల్డ్‌లోకి వెళ్లి సేవలకు ఆటంకం ఏర్పడింది. కేవలం రెండు రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందని అధికారులు చెప్పారు. ఇప్పటికి పదిరోజులైనా పరిష్కరించలేదు. దీంతో మీసేవ కేంద్రాల నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. సర్వర్ల సమస్య ఎప్పటికి పరిష్కారమ వుతుందో అని మీసేవ కేంద్రాల నిర్వాహకులు ఎదురుచూస్తున్నారు. కూటమి అధికారంలోకి రావడంతో మళ్లీ చంద్రబాబు సీఎంగా సర్వీసులన్నింటిలో మార్పులు తీసుకురావాల్సి ఉంది. దీంతో మొత్తం సాఫ్ట్‌వేర్‌లను అధికారులు అప్‌డేట్ చేస్తున్నారు. దీంతో సర్వర్లు హోల్డ్‌లో పెట్టారు.

ఖరీఫ్..రిలీఫ్!


కడియంలో సిద్ధమైన నారుమడి

చిగురిస్తున్న ఆశలు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

జిల్లా రైతాంగం కష్టాల మధ్యే ఖరీఫ్ సాగుకు ఉపక్రమించారు.. ఇంకా చాలా మంది రైతులకు ధాన్యం అమ్మిన సొమ్ములు చేతిలో పడలేదు.. మరో పక్క సాగుకు సమయమైంది.. దీంతో రైతులు అప్పులు చేసి సాగులో దిగారు. గత ఐదేళ్లలో ఏం పంట వేయాలో, ఏ రకం ధాన్యం పండించాలో.. అసలు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏ మేరకు కొంటుందో.. డబ్బులు ఎప్పుడిస్తుందో అర్థంకాని పరిస్థితి.. బొండాల రకం ధాన్యం ధర బాగుంటుందని ఎక్కువ మంది పండిస్తే తాము కొనేది లేదని.. కేంద్రం నుంచి అనుమతి లేదని తీవ్ర ఇబ్బందులు పెట్టిన రోజులు రైతులు మర్చిపోలేదు.ఈ ఏడాది రబీలో పండించిన పంటను పూర్తిగా కొనలేదు. కొన్న ధాన్యానికి ఇంకా సుమారు రూ.200 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉంది. గతంలో కౌలు రైతులు జిల్లాలో 96 వేల మంది ఉన్నట్టు గుర్తించినా కౌలు రుణకార్డులు ఇవ్వలేదు.. కాలువల ఆధునికీకరణ లేదు..డ్రెయిన్లలో తూడు తొలగించలేదు. అయితే రైతులు మళ్లీ తమ ప్రభుత్వం వచ్చిందని కష్టమైనా ఎదు ర్కొని ఖరీఫ్ సాగు చేస్తామనే దిశగా ముందుకు కదులుతున్నారు. జిల్లాలో మొత్తం 2,19,171 మంది రైతులు ఉన్నారు. 85,410 హెక్టార్ల ఆయకట్టు ఉంది. ప్రతి ఏడాది 74,856 హెకార్లు సాగులో ఉంటుంది. వరి సాధారణ ఆయకట్టు 78,789 హెక్టార్లు. సాగు అంచనా ప్రకారం 71,515 హెక్టార్లలో పంట ఉంటుంది. మిగిలిన భూమి మొక్కజొన్న, మిర్చి, కందులు, పెసలు తదితర రకాలు సాగు చేస్తున్నారు.

77,817 హెక్టార్లలో ఆయకట్టు

జిల్లాలో 77,817 హెక్టార్లలో సాధారణ వరి ఆయకట్టు ఉంది. ప్రస్తుతం నారుమడి దశలో ఉంది. రాజమహేంద్రవరం రూరల్ మండలంలో 1521 హెక్టార్లలో సాగుకు 76 హెక్టార్ల నారుమడి అవసరం. ఇంత వరకూ 3 హెక్టార్లలో నారుమళ్లు సిద్ధం చేశారు. కడియంలో 2220 హెక్టార్లకు 111 హెక్టార్ల నారుమళ్లు అవసరం 15 హెక్టార్లలో వేశారు. రాజానగరంలో 4842 హెక్టార్లకు 242 హెక్టార్ల నారు అవసరం ఇప్పటి వరకూ 100 హెక్టార్లలో వేశారు. అనపర్తిలో 3821 హెక్టార్లకు 191 హెక్టార్ల నారు అవసరం కేవలం రెండు హెక్టార్లలో వేశారు. బిక్కవోలులో 6224 హెక్టార్లకు 311 హెక్టార్ల నారు అవసరం 3 హెక్టార్లలో వేశారు. కోరుకొండలో 5912 హెక్టార్లకు 296 హెక్టార్ల నారు కావాలి 10 హెక్టార్లలో వేశారు. గోకవరంలో 5124 హెక్టార్లలకు 256 హెక్టార్ల నారు అవసరమైనా ఆరంభం కాలేదు. సీతానగరంలో 5665 హెక్టార్లకు 283 హెక్టార్ల నారు అవసరం 12 హెక్టార్లలో వేశారు. రంగంపేటలో 2868 హెక్టార్లకు 143 హెక్టార్ల నారు అవసరం 52 హెక్టార్లలో వేశారు.చాగల్లులో 3484 హెక్టార్లకు 174 హెక్టార్ల నారు అవసరం 110 హెక్టార్లలో వేశారు. దేవరపల్లిలో 3718 హెక్టార్లకు 186 హెక్టార్లు అవసరం ఇప్పటి వరకూ 40 హెక్టార్లలో వేశారు.గోపాలపురంలో 4137 హెక్టార్లకు 207 హెక్టార్ల నారు అవసరం కేవలం ఒక హెక్టారులో వేశారు. కొవ్వూరులో 4589 హెక్టార్లకు 229 హెక్టార్ల నారు అవసరం 160 హెక్టార్లలో వేశారు. నిడదవోలులో 7235 హెక్టార్లకు 362 హెక్టార్ల నారు అవసరం 120 హెక్టార్లలో వేశారు. పెరవలిలో 3335 హెక్టార్లకు 167 హెక్టార్ల నారు అవసరం 25 హెక్టార్లలో వేశారు. తాళ్లపూడిలో 3832 హెక్టార్లకు 192 హెక్టార్ల నారు అవసరం 40 హెక్టార్లలో వేశారు. ఉండ్రాజవరంలో 4995 హెక్టార్లకు 250 హెక్టార్ల నారు అవసరం 25 హెక్టార్లలో వేశారు. నల్లజర్లలో 4295 హెక్టార్లకు 215 హెక్టార్ల నారు అవసరం 25 హెక్టార్లలో వేశారు. జిల్లాలోని 77,817 హెక్టార్లకు 3891 హెక్టార్ల నారు అవసరం. ఇప్పటి వరకూ 743 హెక్టార్ల నారు వేశారు.ఇంకా ఎక్కడా నాట్లు పడలేదు.

- ముందస్తు సాగుకు అన్నదాత సన్నద్ధం
- 743 హెక్టార్లలో నారుమడులు పూర్తి
- సాగులో 2,19,171 మంది రైతులు
- 58,356 టన్నుల ఎరువులు అవసరం
- 30 వేల టన్నులే దిగుమతి
- రైతాంగం ఎదురుచూపులు

ఎరువులు సిద్ధం

జిల్లాకు 58,356 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం. 25,802 టన్నుల యూరియా, 5028 టన్నుల డీఏ పీ, 6327 టన్నుల ఎంవోపీ, 15,889 టన్నుల ఎన్‌పీకే, 5310 టన్నుల ఎస్ఎస్‌పీకి ఎరువులు అవసరం. కానీ ఇప్పటి వరకూ జిల్లాకు యూరియా 13551 టన్నులు,డీఏపీ 1767 టన్నులు, ఎంవోపీ 1944 టన్నులు, ఎన్‌పికె 9134 టన్నులు, ఎస్ఎస్‌పి 3602 టన్నులు వచ్చాయి.ఇప్పటికే రైతులు కొనుగోలు చేసిన దాట్లో 2774 టన్నుల యూరియా,270 టన్నుల డీఏపీ, 552 టన్నుల ఎంవోపీ, 1746 టన్నుల ఎస్‌పికె, 741 టన్నుల ఎస్ఎస్‌పీ ఎరువులు ఉన్నాయి.28,356 టన్నుల ఎరువులు రావలసి ఉంది.

ఎకరాకు రూ.50 వేల పెట్టుబడి..



తొమ్మిదెకరాల్లో కౌలు సాగు చేస్తున్నా. దాళ్వాలో వాతావరణం అనుకూలిస్తే 30 బస్తాలు దిగుబడి వస్తుంది. సార్వాలో 35 నుంచి 45 బస్తాల దిగుబడి వస్తుంది. ఎకరాకు రూ.50 వేల వరకు పెట్టుబడి అవుతుంది. ఐకేపీ ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తే గిట్టుబాటు ధర లభిస్తుంది.అయితే దేవరపల్లి మండలంలో ధాన్యం కొనుగోలు చేసే రైసుమిల్లులు లేక ఇబ్బందులు పడుతున్నాం.

- గద్దె శరత్‌బాబు, కౌలురైతు, సంగాయిగూడెం


ఆకుమడులు వేస్తున్నాం..



నేను 10 ఎకరాల్లో సాగు చేస్తున్నా. మృగశిర కార్తె ఆరంభం కావడంతో కాలువ నీరు ముందుగా వచ్చే ప్రాంతంలో ఆకుమడులు వేసుకుంటున్నాం. గతంలో స్వర్ణ రకం వేశా. శిస్తు కాకుండా దమ్ము చేసే సమయం నుంచి నాట్లు, ఎరువులు, పురుగుమందులు, కూలీలు, కోత, నూర్పు వంటి వాటికి ఎకరానికి రూ. 30 వేల వరకు ఖర్చవుతుంది.

- తోరాటి కృష్ణమూర్తి, కడియం

ఈసారి ముందస్తు ఖరీఫ్



ఈసారి ముందస్తు ఖరీఫ్ సాగవుతుంది. దీని వల్ల నవంబరులో వచ్చే తుఫాన్‌ల నుంచి 70 శాతం పంట బయటపడుతుంది.ఈ నెల 15వ తేదీకి నారుమళ్ల పూర్తి కావలసి ఉంది. జూలై నెలాఖరుకు నాట్లు పూర్తవుతాయి. 70 శాతం కోతలు అక్టోబరు, మిగతా 30 శాతం నవంబర్‌లో పూర్తవుతుంది. జిల్లాలో 30 శాతం స్వర్ణ, ఎంటీయూ 7029, పీఎల్‌ఏ 1100 రకాలు 30 శాతం సాగు చేస్తున్నారు. 15 శాతం ఎంటీయూ 1318, 5 శాతం బీపీటీ 5204 సాగు చేస్తున్నారు. రబీలో విత్తనాలకు ఎంటీ యూ 1121,1156, 1153 రకాలు సాగు చేస్తున్నారు.

- ఎస్.మాధవరావు, జిల్లా వ్యవసాయాధికారి




ఆరంభమే..తర్వాత వదిలేశారు : రాజమండ్రి వైపు గడ్డరు లేకుండా ఉన్న బ్రిడ్జి.. కొవ్వూరు వైపున గడ్డరు లేకుండా ఉన్న బ్రిడ్జి

రోడ్ కం రైలు బ్రిడ్జిపై నిర్లక్ష్యం

- రెండు వైపులా విరిగిన గడ్డర్లు
- భారీ వాహనాల రాకపోకలు
- బ్రిడ్జి మనుగడ ప్రశ్నార్థకం
- పట్టించుకోని అధికారులు
- కొత్త పాలకులైనా దృష్టి పెట్టాలి

కొవ్వూరు, జూన్ 10 : రోడ్డు కం రైలు బ్రిడ్జిపై భారీ వాహనాల రాకపోకలను నిషేధిస్తూ వేసిన గడ్డర్లు భారీ వాహనాలు ఢీకొని విరిగి పడిపోతున్నాయి. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో రాత్రి సమయాల్లో వంతెనపై భారీ వాహనాలు యథేచ్ఛగా తిరుగుతున్నాయి. భారీ వాహనాల ఢీకొని బ్రిడ్జికి ఇరువైపులా వేసిన గడ్డర్లు గత నెల రోజులుగా విరిగి కింద పడి ఉన్నాయి. బ్రిడ్జిని పరిరక్షించాల్సిన అధికారుల మధ్య సమన్వయ లోపంతో గోదావరి జిల్లాల ప్రజలు తరచుగా ఇబ్బందులు పడుతున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందిం చి ప్రజలకు ఇబ్బంది లేకుండా రోడ్డు కం రైలు బ్రిడ్జికి పూర్తిస్థాయి భద్రత కల్పించాలని వాహనదారులు కోరుతున్నారు. కొవ్వూరు,రాజమహేంద్రవరంలను కలుపుతూ గోదావరి నదిపై నిర్మించిన రోడ్డు కం రైలు బ్రిడ్జే ఉభయ గోదావరి జిల్లాలకు ఆధారం.అటువంటిది రోడ్డు కం రైలు బ్రిడ్జి మనుగడ నేడు ప్రశ్నార్థకంగా మారింది. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం రోడ్డు కం రైలు వంతెన పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో బ్రిడ్జి పూర్తిగా శిధి లావస్థకు చేరింది. తాత్కాలిక మరమ్మతుల పేరుతో గత రెండేళ్లలో సుమారు ఏడెనిమిది సార్లు వంతెనను మూసివేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేశారు. తాజాగా 2023 సెప్టెంబరు 26వ తేదీ నుంచి నవంబరు 11వ తేదీ వరకు వంతెనను మూసివేసి రూ.2.10 కోట్లతో మరమ్మతు పనులు చేపట్టారు. ఆ పనులు ఇప్పటికి కొనసాగుతూనే ఉన్నాయి.పనుల్లో నాణ్యత ఉందా అంటే ఆ దేవుడుకే ఎరుక. వంతెనపై గతంలో ఉన్న తారు రోడ్డును తొలగించి, మరలా కొత్తగా తారు రోడ్డు వేశారు అంతే. వంతెన పటిష్టతకు పూర్తిస్తాయిలో చేసిందేమి లేకపోవడంతో బ్రిడ్జిపై భారీ వాహన రాకపోకలను నిషేధించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బ్రిడ్జికి రెండు వైపులా ఇనుప గడ్డర్లను ఏర్పాటు చేశారు.అయితే ఆ గడ్డర్లు పూర్తిస్థాయి నాణ్యత లేకపోవడంతో పట్టుమని పదిరోజులు కూడా నిలవడం లేదు.ప్రతిరోజు రాత్రి సమయంలో ఏదో ఒక వాహనం గడ్డర్లను ఢీకొట్టడం విరిగి కిందడిపోవడం పరిపాటిగా మారింది.ఆర్టీసి బస్సు పైకప్పుపై ఉన్న లగేజి గ్యారేజ్ తగిలి ఇనుపరాడ్లు విరిగి కింద పడిపోతున్నాయి. దీంతో రాత్రి సమయాల్లో యథేచ్ఛగా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వంతెనను పరిరక్షించాల్సిన ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోవడంలేదు.దీంతో రాత్రి సమయంలో భారీ వాహనాలు, లారీలు వంతెనపై రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రజా రవాణాకు అంతరాయం కలిగించిన అధికారులు, నిబంధనలను అతిక్రమించి రాకపోకలు సాగిస్తున్న అక్రమ రవాణాకు అనుమతిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇకనైనా రోడ్డు కం రైలు బ్రిడ్జికి పటిష్టతకు సంబంధిత శాఖల అధికారులందరిని సమన్వయపరిచి కొత్త ప్రభుత్వంలోనైనా వంతెనకు పూర్తిస్థాయిలో శాశ్వత మరమ్మతులు చేపట్టే విదంగా చర్యలు తీసుకోవాలని గోదావరి జిల్లాల ప్రజలు కోరుతున్నారు.

తాగునీరు వృథా!

లీకవుతున్న పైపులైన్లు.. పట్టించుకోని అధికారులు



తాళ్లపూడిలో పైప్‌లైన్ లీకై రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు

తాళ్లపూడి, జూన్ 8: తాళ్లపూడి పంచాయతీ కార్యాలయం సమీపంలో రోడ్డుపై పైపులైన్లు ద్వారా లీకై తాగు నీరు వృథా అవుతోంది. అంతేగాక ఆ నీరు నిల్వ ఉండి ఆ దారిన వెళ్లే వారికి ఇబ్బందికరంగా మారింది. తాళ్లపూడి గోదావరి ప్రాజెక్టుకు చెందిన వాటర్ పైపులైను పాడై రోడ్డుపైకి చేరుతున్న నీరు రోజురోజుకూ పెరిగి పాదచారులకు, వాహనదారులకు ఇబ్బందిగా మారుతోంది. దీనిపై స్థానికులు మండల స్థాయి, స్థానిక పంచాయతీ అధికారులకు తెలిపినప్పటికీ సమస్య పరిష్కారానికి ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యే విజేత ముప్పిడిని కలిసిన డీఎస్పీ



ముప్పిడికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీఎస్పీ శ్రీనివాసమూర్తి

కొవ్వూరు, జూన్ 10: కూటమి ఎమ్మెల్యే విజేత ముప్పిడి వెంకటేశ్వరరావును కొవ్వూరు డీఎస్పీ కె.శ్రీనివాసమూర్తి మర్యాదపూర్వకంగా కలిశారు. టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ముప్పిడితోపాటు ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణారావులకు డీఎస్పీ పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. నియోజకవర్గంలో శాంతిభద్రతలపై డీఎస్పీతో చర్చించారు. అలాగే ఏఎంసీ కార్యదర్శి టి.శ్రీనివాసులు, సిబ్బంది, ఎస్ఈబీ ఎస్.ఐ, మెప్మా సిబ్బంది, ఇతరశాఖల అధికారులు మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు.

ఉమారామలింగేశ్వర ఆలయంలో ముప్పిడి పూజలు



దేవరపల్లి, జూన్ 10: దేవరపల్లిలో పార్వతి సమేత ఉమారామలింగేశ్వర ఆలయంలో సోమవారం కొవ్వూరు ఎమ్మెల్యే విజేత ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ప్రధానార్చకులు ఆశీర్వచనాలు, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

లయన్స్‌క్లబ్ కొవ్వూరు అధ్యక్షుడిగా సత్యనారాయణ

కొవ్వూరు, జూన్ 10: కొవ్వూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా మద్దిపాటి సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కలగర వెంకట్రావు ఆధ్వర్యంలో ఉప్పులూరి రామకృష్ణ నివాసంలో సోమవారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మద్దిపాటి సత్యనారాయణ, కార్యదర్శిగా నామాన బుల్లిరాజు, కోశాధికారిగా నాళం శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా యాగంటి చలపతిరావు, ఉపాధ్యక్షులుగా పిల్లమర్రి సర్వేశ్వరరావు, ఎండి హరాస్సేన్, జీవీఎస్ శివప్రసాద్, మెంబర్ షిప్ చైర్‌పర్సన్‌గా పెనుమాక జయరాజు, ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణకు పలువురు అభినందనలు తెలిపారు.

తుప్పలు తొలగింపు



కానూరు అగ్రహారంలో కమ్యూనిటీ హాల్ వద్ద చెత్తను శుభ్రం చేస్తున్న దృశ్యం

పెరవలి, జూన్ 10: వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన నిర్లక్ష్యంతో అంత కువముందు టీడీపీ ప్రభుత్వం చేపట్టిన పథకాలు, భవన నిర్మాణాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. గత ఐదేళ్లలో ప్రభుత్వం వాటిని పట్టించుకోకపోవడంతో తుప్పలు పెరిగి భయానకంగా మారిపోయాయి. అయితే కూటమి ప్రభుత్వం రావడంతో అమరావతిలో పేరుకున్న తుప్పలను శుభ్రం చేస్తున్నారు. అదే స్ఫూర్తితో గ్రామాల్లో కూడా ప్రభుత్వ భవనాలు చుట్టు పేరుకున్న చెత్తను తొలగించడానికి కూటమి కార్యకర్తలు నడుంబిగించారు. దీనిలో భాగంగానే కానూరు అగ్రహారంలో ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు హయాంలో సగంలో ఆగిపోయిన కమ్యూనిటీ హాలు చుట్టు పేరుకున్న చెత్తను తొలగించారు.

ప్రమాణ స్వీకార సభా స్థలి పరిశీలన




కేసరపల్లిలో సభాస్థలిని పరిశీలిస్తున్న ముళ్లపూడి బాపిరాజు

నల్లజర్ల, జూన్ 10: ఈ నెల 12న ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న చంద్రబాబు సభాస్థలిని జడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు సోమవారం పరిశీలించారు. విజయవాడ పరిధిలోని కేసరపల్లిలో ఏలూరు పార్లమెంట్ కన్వీనర్ గన్ని వీరాంజనేయులతో కలిసి సభా స్థలాన్ని, ప్రమాణ స్వీకార ఏర్పాట్లు పరిశీంచినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన వెంట వల్లూరి సత్తిపండు, ఎంపీటీసీ రావూరి వెంకటరమణ, విడియాల శ్రీను, కోడూరి నారాయణ, సవలం రామకృష్ణ ఉన్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

పంచాయతీ కార్యదర్శులతో ఎంపీడీవో రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రమేష్

గోపాలపురం, జూన్ 10: విధి నిర్వహణలో పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో కె.రమేష్ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తాగునీటి సరఫరా, వీధిలైట్ల నిర్వహణ, పారిశుధ్యం తదితర అంశాలపై పంచాయతీ కార్యదర్శులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామంలోనూ తాగునీటి ఎద్దడి రాకుండా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. వీధిలైట్లు, పారిశుధ్యం నిర్వహణ యుద్ధప్రతిపాదికన జరగాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కారణంగా వ్యాధులు ప్రబలకుండా మురుగునీటి నిర్వహణ చేపట్టాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సార్వాకు సిద్ధం

- దమ్ములు చేసి నారుమడులు వేస్తున్న రైతులు
- సన్న రకాల సాగుకు మొగ్గుచూపుతున్న రైతాంగం



దేవరపల్లి: త్యాజంపూడిలో ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న దృశ్యం

కడియం/నిడదవోలు/దేవరపల్లి, జూన్ 10: కడియం ఆవ ప్రాంతంతో పాటు వీరవరం, దామిరెడ్డిపల్లి, మాధవరాయుడుపాలెం, జేగురుపాడు, మురమండ, దుళ్ల, వేమగిరి తదితర గ్రామాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. ఇప్పటికే రైతులు దమ్ము చేసి నారుమడులు చేసి వరివిత్తనాలు జల్లి ఆకుమడులకు సిద్ధం చేస్తున్నారు. ఈ ఏడాది తొలకరి పంటకు గాను మండలంలో సుమారు 5 వేల ఎకరాల్లో రైతులు ఎంటీయూ 1318, ఎంటీయూ 7029 రకాలను సాగు చేస్తున్నారని వ్యవసాయ శాఖ అధికారి ద్వారకాదేవి తెలిపారు. నిడదవోలు పట్టణ మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 16,500



నిడదవోలు మండలంలో నారుమడి



త్యాజంపూడిలో దమ్ము

ఎకరాల్లో వరి సాగుకు రైతాంగం సమాయత్తమయ్యారు. మండలంలో సుమారు 50 ఎకరాలకు పైగానే నారుమడులు వేగవంతం అయ్యాయి. స్వర్ణ రకానికి చెందిన ఎంటీయూ 7029, సంపద స్వర్ణ టీఎల్‌పీ 1100, ఎంటీయూ 1061, 1064 రకాల సాగుకు రైతులు సిద్ధమయ్యారు. దేవరపల్లి మండలంలో ఎనిమిది వేల ఎకరాల్లో వరి సాగుచేస్తున్నారు. ప్రధానంగా గౌరీపట్నం, దుద్దుకూరు, యర్నగూడెం, సంగాయిగూడెం, త్యాజంపూడి గ్రామాల్లో వరి సాగు చేస్తుంటారు. ప్రధానంగా స్వర్ణ, పీఎల్ 1100, ఎల్‌పీ 1318, ఎంపీ 1061, ఎంపీ 1064 రకాలు వరినారు రైతులకు మడులు కట్టారని దేవరపల్లి మండల ఏవో కే.విజయ్ తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే సకాలానికి రుతుపవనాలు రావడం, అడపాదడపా వర్షాలు పడడంతో రైతులు వరినాట్లకు అవసరమైన ఆకుమడులను సిద్ధం చేస్తున్నారు.

సత్యనారాయణస్వామి ఆలయ కమిటీ రాజీనామా

రాజమహేంద్రవరం కల్చరల్ జూన్ 10: వైసీపీ ఓటమి చెందడం.. నామినేటెడ్ పదవుల రద్దు కారణంగా ఆర్యాపురం శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానం పాలక మండలి సభ్యులు సోమవారం రాజీనామాలు సమర్పించారు. చైర్‌పర్సన్ దుంగా మంగ, డైరెక్టర్లు బల్లిపాటి శ్రీను, విశారపు కాశీ విశ్వనాథం, రఘుపాత్రుని సాయిబాబు, బసరబోయిన విజయశంకర్, సాగరాల దిలీప్ హర్ష, రేగుల అన్నపూర్ణ, చక్కాకుల వెంకటరమణి, సంసాని దుర్గ, పామడిపల్లి వీజీ, రవిబాబు రాజీనామా చేశారు. ఈ మేరకు ఈవో సత్యవేణికి సోమవారం రాజీనామా లేఖను అందజేశారు.

ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు

గోపాలపురం/దేవరపల్లి, జూన్ 10: హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలు పలు గ్రామాల్లో సోమవారం టీడీపీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఎన్టీఆర్ విగ్రహాల వద్ద కేకులు కోసి కార్యకర్తలకు స్వీట్లు పంచారు. దేవరపల్లి ఎన్టీఆర్ నగర్ రాజులవీధిలో ఆర్ఆర్ యూత్ ఆధ్వర్యంలో అభిమానులు, బీజేపీ, జనసేన నాయకులు భారీ కేకును కట్ చేశారు. అనంతరం ఎన్నికల్లో విజయం సాధించడం కూటమి నాయకులను ఆర్ఆర్ యూత్ సత్కరించింది. కార్యక్రమంలో గన్నమని హరికృష్ణ, సుంకర దుర్గారావు, కరుటూరి శ్రీనివాస్, యాగంటి వెంకటేశ్వరరావు, గద్దే సుబ్రహ్మణ్యం, రాంబాబు, యాగంటి శ్రీని వాస్, కైరం అప్పారావు, కంబాల సత్తిబాబు, ఓరుగంటి లక్ష్మీపతిరాజు పాల్గొన్నారు

రాజానగరం: మండంలోని సూర్యారావుపేటలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద నందమూరి యువసేన మండలాధ్యక్షుడు పాతూరి నవీన్‌చౌదరి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి ముఖ్యఅతిథిగా విచ్చేసి కేక్‌ను కట్‌చేసి అభిమానులకు తినిపించారు. సినీ, రాజకీయ రంగాల్లోనే కాకుండా సమాజసేవా కార్యక్రమాల్లోనూ బాలకృష్ణ ఎంతో ప్రజాదరణ పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో నందమూరి యువసేన పార్లమెంటు ప్రధాన కార్యదర్శి అట్లూరి రాజేష్, మార్గాని రామకృష్ణ, తెల్ల



దేవరపల్లిలో కేకు కట్ చేస్తున్న అభిమానులు, టీడీపీ, ఆర్ఆర్‌యూత్



రాజానగరం: సూర్యారావుపేటలో కేక్ తినిపిస్తున్న బీవీఆర్ చౌదరి

మేకల వీరబాబు, టీడీపీ నాయకులు గంగిశెట్టి చంటిబాబు, కందుల బాబూరాయుడు, వంక మల్లిబాబు, కొల్లం రత్నం, బత్తుల త్రిమూర్తులు, నీలపాల అరవరాజు పాల్గొన్నారు.

కోరుకొండ: కోరుకొండ అల్లూరి సీతారామరాజు జంక్షన్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణచౌదరి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తనకాల నాగేశ్వరరావు, దాశెట్టి శ్రీనివాస్, కర్రి పెంటాజీ, డి.సుబ్రహ్మణ్యం, గుర్ర్తుర్తి రవిబాబు, ఉప్పలపాటి వీరాస్వామి, కొయ్యాశామ్యూల్, కొచ్చెర్ల చిన్నారావు పాల్గొన్నారు.

రంగంపేట: వడిశలేరులో దండుగంగమ్మ గుడి యూత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవింద్ టీడీపీ జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. స్వీట్స్ పంచి బాణసంచా కాల్చారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వడిశలేరులో టీడీపీకి అధిక మెజారిటీ రావటానికి కృషి చేసిన దండుగంగమ్మ గుడి యూత్‌కు, టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఎన్టీరాజాపురంలో బాలకృష్ణ జన్మదిన వేడుకలు జరిపారు. కార్యక్రమంలో వెలుగుబంటి సత్తిబాబు, ఉద్దండ్రావు శ్రీను, పోతుల వెంకట్రావు,మాచిన వెంకన్నదొర, సేవ శ్రీను, ఉప్పలపాటి బులిదొర, బద్దె వరప్రసాద్, ఆళ్ల రామకృష్ణ పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు రూ.73 కోట్ల బ్యాంకు రుణాలు

- బీవోఏలతో సమీక్షా సమావేశంలో ఏపీఎం జయంతిరాజు

కోరుకొండ, జూన్10: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మండలంలోని 1306 మహిళా శక్తి సంఘాలకు పది బ్యాంకు శాఖల ద్వారా రూ.73,54,78,000 బ్యాంకు రుణాలుగా అందజేశామని ఏపీఎం జయంతిరాజు తెలిపారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సోమవారం గ్రామైక్య సంఘాల బీవోఏలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంక్ ఆఫ్ బరోడా కోరుకొండ శాఖ ద్వారా రూ.6.16 లక్షలు, బూరుగుపూడి శాఖ ద్వారా రూ.23 లక్షలు, గాదరాడ బ్యాంకు ద్వారా రూ.26.71 లక్షలు, శ్రీరంగపట్నం బ్యాంకు ద్వారా రూ.18.43 లక్షలు, గాడాల చైతన్యగోదావరి గ్రామీణ బ్యాంకు ద్వారా రూ.4,35,66,000, శ్రీరంగపట్నం శాఖ ద్వారా రూ.22,57,44,000, స్టేట్ బ్యాంక్ శాఖ ద్వారా రూ.11,07,84,000, తొర్రెడు శాఖ ద్వారా రూ.6,58,39,000, మిర్తిపాడు శాఖ ద్వారా రూ.1.60 కోట్లు, పశ్చిమగోనగూడెం యూనియన్ బ్యాంక్ ద్వారా రూ. 24,66,10,000 వివిధ మహిళా



వీవోలతో సమీక్ష నిర్వహిస్తున్న ఏపీఎం జయంతిరాజు

స్వయం సహాయ సంఘాలకు రుణాలుగా అందజేశామన్నారు. అలాగే ఆసరా పథకం కింద కోరుకొండ మండలంలోని 20 గ్రామాల్లో 1569 మహిళా స్వయం శక్తి సంఘాల్లోని 15690 మంది మహిళలకు రూ.14,54, 06,594 సహాయం అందజేసినట్టు ఏపీఎం జయంతిరాజు తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో ఉండాలి



నల్లజర్ల, జూన్ 10: అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో ఉండాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి ఉన్నమట్ల వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం నల్లజర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో విశ్రాంత ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశం అధ్యక్షుడు ఐవీ సత్యం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ప్రభుత్వం అన్ని వ్యవస్థలను గాడిలో పెట్టి సుపరిపాలన అందించాలని ఆకాంక్షించారు. సమాజంలో అన్ని వర్గాల అభ్యున్నతే నూతన ప్రభుత్వ ధ్యేయంగా ఉండాలన్నారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వ పెన్షనర్లు తీవ్ర మనోవేదనకు గురయ్యారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎం ఆలీసాహెబ్, ప్రసాద్, బాలయ్య, ఎన్.రాజేంద్రప్రసాద్, దత్తు తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

కొవ్వూరు, జూన్ 10: బాలికను ప్రేమించి గర్భవతిని చేసిన యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. కొవ్వూరు మండలంలో పదో తరగతి చదువుతున్న బాలికను ఆరికిరేవుల గ్రామానికి చెందిన ఆనంద్ 7 నెలలుగా ప్రేమిస్తున్నానని చెప్పి వెంట తిరిగేవాడు. ఇటీవల బాలికను ఆసుపత్రిలో చూపించగా మూడు నెలల గర్భిణి అని తెలియడంతో బాలిక తల్లి కొవ్వూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. ఈ మేరకు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

అసైన్డ్ భూబదలాయింపు నిషేధ చట్టం రద్దు చేయాలి

అయినాపురపు సూర్యనారాయణ

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 10 : గత వైసీపీ ప్రభుత్వం చేసిన అసైన్డ్ భూబదలాయింపు నిషేధ చట్టం 9/77ను చంద్రబాబు రద్దు చేయాలని అఖిల భారత పార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి అయినాపురపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు.స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం రద్దుచేసిన 27 ఎస్సీఎస్టీ పథకాలను తిరిగి పునరుద్ధరించాలని కోరారు. చంద్రబాబు సీఎం పదవి చేపట్టిన వెంటనే అసైన్డ్ భూబదలాయింపు నిషేద చట్టం రద్దుచేయాలని విజ్ఞప్తి చేశారు. పోలవరం ప్రాజెక్టు విషయంలో కొత్త భూసేకరణ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలన్నారు. రంపచోడవరం కేంద్రంగా మరొక జిల్లాను ప్రకటించాలని, ఎస్సీఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ఈ సమావేశంలో పిట్టా వరప్రసాద్, యార్లగడ్డ శ్రీనివాసరావు, ఎస్.వినోద్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన నల్లమిల్లి



ఢిల్లీలో పురందేశ్వరిని కలిసిన నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, జూన్ 10: ఈనెల 12న ఏపీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న టీడీపీ అధినేత చంద్రబాబును సోమవారం ఎమ్మెల్యే విజేత నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఢిల్లీలో మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారానికి ఢిల్లీ వెళ్లిన ఇద్దరు నేతలు అక్కడ కలుసుకు న్నారు. ఈ సందర్భంగా చంద్రబాబును సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేగా ఎన్నికైనందుకు చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఢిల్లీ లో కేంద్ర మంత్రులు కింజరపు రామ్మోహననాయుడు, పెమ్మసాని చంద్రశే ఖర్‌తోపాటు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి శివప్రకాష్‌జీని నల్లమిల్లి మ ర్యాద పూర్వకంగా కలిశారు. ఎంపీ పురందేశ్వరి, వెంకటేశ్వరరావు దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రులను సత్కరించి శుభాకాం క్షలు తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించినట్టు తెలిపారు. నల్లమిల్లి వెంట బీజేపీ నాయకుడు టి.రామకృష్ణారెడ్డి తదితరులున్నారు.

రామోజీరావుకు ఏపీయూడబ్ల్యూజే నివాళి

అనపర్తి, జూన్ 10: పత్రికా రంగంలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టి అనేక సంచలనాలు సృష్టించిన రామోజీరావు కృషి మరువలేనిదని ఏపీయూ డబ్ల్యూజే అనపర్తి ప్రతినిధులు అన్నారు. సోమవారం అనపర్తిలోని ప్రెస్‌క్లబ్ ఆవరణలో నిర్వహించిన సంతాప సభలో రామోజీ చిత్రపటానికి పూలమాల లతో నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జర్నలి స్టులు దుర్గా శ్రీరామమూర్తి, పీవీఎస్ సూర్యనారాయణ, కర్రి శ్రీనివాసరెడ్డి (బుజ్జి), సత్తి శ్రీనివాసరెడ్డి, రెడ్డి గోపాలకృష్ణ, గురవయ్య, టీడీపీ నాయకులు కర్రి వెంకటరామారెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, బాసి, ఈ.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఐటీఐ విద్యార్థులకు క్యాంపస్ ఇంటర్వ్యూలు

రాజమహేంద్రవరం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రైవేటు ఐటీఐలలో శిక్షణ పొందుతున్న చివరి ఏడాది విద్యార్థులకు ప్రముఖ కంపెనీలలో ఉద్యోగాల కోసం ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తున్నామని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్‌ఆర్‌ఆర్ కృష్ణన్ తెలి పారు. జిల్లా ఎంప్లాయ్‌మెంట్ ఎక్ఛేంచ్, వికాస, ఏపీఎస్ఎస్‌డీసీ, టాటా స్ట్రీవ్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో నియామకాలు జరుగుతాయన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు తమ సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలు, రెజ్యూమ్‌తో ఈ నెల 13న హాజరు కావాలన్నారు.

పార్కు ఆర్చ్ కూల్చేసిన బ్లేడ్‌బ్యాచ్

రాజమహేంద్రి పరిరక్షణ సమితి అధ్యక్షుడు టీకే

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 10: పార్టీలకతీతంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన మునిసిపల్ కాలనీ పార్కులో అసాం ఘిక శక్తులు పేట్రేగి పార్కు మెయిన్‌గేట్ ఆర్చ్‌ను కూల్చివేశాయని రాజమహేంద్రి పరిరక్షణ సమితి అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మునిసిపల్ కాలనీ పార్కులో సోమవారం విలేకరులతో మాట్లాడారు. మునిసిపల్ కాలనీ పార్కులో చేరుతున్న గంజాయి,బ్లేడ్ బ్యాచ్‌ల ను మందలించడంతో కక్షగట్టి ఆర్చ్‌ని కూల్చివేసి ఈ నేపం టీడీపీపైకి నెట్టేవిధంగా ఆ పార్టీ జెండాలను పార్కులో కట్టారన్నారు. దీనిపై త్రీటౌన్‌లో ఫిర్యాదు చేశామని చెప్పారు. సీఐ స్పందించి చర్యలు తీసుకుంటామని చెప్పారన్నారు. సమావేశంలో గారపాటి విశ్వనాథం, జాలా నటరాజ్, పినిశెట్టి సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

పది మహిళా సంఘాలకు రూ.73 కోట్ల బ్యాంకు రుణాలు : ఏపీఎం

కోరుకొండ, జూన్10: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మండలంలోని 1306 మహిళా శక్తి సంఘాలకు పది బ్యాంకు శాఖల ద్వారా రూ.73,54,78,000 బ్యాంకు రుణాలుగా అందజేశామని ఏపీఎం జయంతిరాజు తెలిపారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో సోమవారం గ్రామైక్య సంఘాల బీవోఏలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంక్ ఆఫ్ బరోడా కోరుకొండ శాఖ ద్వారా రూ.6.16 లక్షలు, బూరుగుపూడి శాఖ ద్వారా రూ.23 లక్షలు, గాదరాడ బ్యాంకు ద్వారా రూ.26.71 లక్షలు, శ్రీరంగపట్నం బ్యాంకు ద్వారా రూ.18.43 లక్షలు, గాడాల చైతన్యగోదావరి గ్రామీణ బ్యాంకు ద్వారా రూ.4,35,66,000, శ్రీరంగపట్నం శాఖ ద్వారా రూ.22,57,44,000, స్టేట్ బ్యాంక్ శాఖ ద్వారా రూ.11,07,84,000, తొర్రెడు శాఖ ద్వారా రూ.6,58,39,000, మిర్తిపాడు శాఖ ద్వారా రూ.1.60 కోట్లు, పశ్చిమగోనగూడెం యూనియన్ బ్యాంక్ ద్వారా రూ. 24,66,10,000 వివిధ మహిళా స్వయం సహాయ సంఘాలకు రుణాలుగా అందజేశామన్నారు. అలాగే ఆసరా పథకం కింద కోరుకొండ మండలంలోని 20 గ్రామాల్లో 1569 మహిళా స్వయం శక్తి సంఘాల్లోని 15690 మంది మహిళలకు రూ.14,54, 06,594 సహాయం అందజేసినట్టు ఏపీఎం జయంతిరాజు తెలిపారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో 'లారెల్ హై'కు ఉత్తమ ర్యాంకులు







రాజమహేంద్రవరం సిటీ, జూన్ 10: జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తొలిప్రయత్నంలో రాజమహేంద్రవరంలోని లారెల్ హై గ్లోబల్ స్కూల్ విద్యార్థులు అద్భుత విజయం సాధించారని డైరెక్టర్ రవికుమార్ సుంకర తెలిపారు. తమ పాఠశాల నుంచి 21మంది విద్యార్థులు అర్హత సాధించారని తెలిపారు. గోరిపర్తి సాయి కృష్ణ(3504), బి.యశ్వంత్(4368), పి.హర్షిత(153 88), ముప్వాలా సైలేష్(16721) వివిధ కేటగిరీల్లో ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. నలుగురు విద్యార్థులు ఐఐటీలో చదువుకునే అవకాశం లభిస్తుందని రవికుమార్ అన్నారు.

మొక్కు తీర్చుకున్న బలభద్రపురం వాసులు

బిక్కవోలు, జూన్ 10: రాష్ట్రంలో మరలా సీఎంగా చంద్రబాబు, ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి గెలుపొందితే గౌరిపట్నం వస్తామని బలభద్రపురం ఎస్సీపేట వాసులు మొక్కుకున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇద్దరూ గెలుపొందడంతో స్థానిక నాయకుడు నేదూరి చిన్న ఆధ్వర్యంలో సోమవారం వారందరూ లారీలో మొక్కు చెల్లించుకోడానికి గౌరీపట్నం వెళ్లారు. వారికి నాయకులు నల్లమిల్లి సుబ్బారెడ్డి, చిన్నం వీర్రాఘవరెడ్డి, మల్లిడి కనకప్రసాద్‌రెడ్డి, ఎస్సీ పేట పెద్దలు వీడ్కోలు పలికారు.

వైభవంగా అంకాలమ్మ గ్రామోత్సవం



కోరుకొండ, జూన్ 10: కోరుకొండ గ్రామదేవత అంకాలమ్మ గ్రామోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. నూతనంగా తయారు చేసిన రథంలో అమ్మ వారిని ఆశీనులను చేసి మంగళ వాయిద్యాలు, బాణసంచా కాల్పుల మధ్య గ్రా మంలో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు మొక్కులు చెల్లించారు. సా యంత్రం ఆలయం వద్ద మేకపోతు సిరి తిప్పారు.

ఆటో ఢీకొని అన్నాచెల్లెల్లకు గాయాలు

కొవ్వూరు, జూన్ 10: ఆటో ఢీకొని అన్నాచెల్లెల్లు గాయపడినట్టు హెడ్‌కానిస్టేబుల్ సాంబమూర్తి తెలిపారు. కొవ్వూరు మండలం తోగుమ్మి గ్రామం నుంచి బోగవల్లి సుజనచౌదరి, చెల్లెలు సౌమ్య బైక్‌పై కుమారదేవం బయలుదేరారు. వేములూరు సాయిబాబా గుడి సమీపంలో బైక్‌ను ఆటో వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఇద్దరికీ గాయాలు కావడంతో రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. సుజనచౌదరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.

చంద్రబాబు ప్రమాణానికి మోదీ రాక

పలు చోట్ల ట్రాఫిక్ మళ్లింపు

రాజమహేంద్రవరం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న(రేపు) చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారోత్సవానికి గన్నవరం మండలం కేశరపల్లి గ్రామ సమీపంలోని ఐటీ పార్క్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ వేడుకకు సుమారు లక్ష మంది హాజరవుతారని అంచనా వేస్తున్నారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని స్వయంగా తిలకించడానికి ప్రధాని మోదీ వస్తున్నారు. దీంతో ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల ట్రాఫిక్‌ని మళ్లించనున్నారు. బుధవారం ఉదయం 4గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకూ జాతీయ రహదారిపై సరుకు రవాణా, భారీ వాహనాలను రాష్ట్రంలో 12 చోట్ల దారి మళ్లిస్తారు. ఈ విధులకు ఏడుగురు ఐపీఎస్ అధికారులను ప్రత్యేకంగా నియమించారు. విశాఖపట్నం నుంచి చెన్నై వెళ్లే వాహనాలు హెవీ, మీడియం ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు కత్తిపూడి వద్ద దారి మళ్లి కాకినాడ, అమలాపురం, నర్సాపురం, లోసర బ్రిడ్జి, మచిలీపట్నం, రేపల్లే, బాపట్ల, త్రోవగుంట మీదుగా ఒంగోలు వద్ద జాతీయ రహదారికి చేరుకుంటాయి. ఈ బాధ్యతలను కాకినాడ ఎస్పీ సతీశ్‌కుమార్ పర్యవేక్షిస్తారు. విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలను గామన్ బ్రిడ్జి, దేవరపల్లి, జంగారెడ్డిగూడెం, ఖమ్మం గుండా హైదరాబాద్ పంపిస్తారు. ఈ విధులను తూర్పుగోదావరి ఎస్పీ జగదీశ్ పర్యవేక్షిస్తారు. రేపు(బుధవారం) ట్రాఫిక్ మళ్లింపులను తెలుసుకుంటూ వాహనదారులు రాకపోకలు సాగించాలని ఈ సందర్భంగా అధికారులు విజ్ఞప్తి చేశారు. రహదార్లపై వాహనాలు నిలపడం, ట్రాఫిక్‌కి అంతరాయం కలిగించే విధంగా వ్యవహరించడం చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1	లవ్ మీ
వై.స్క్రీన్ 2	గంగం గణేశా
దేవిశ్రీ(గాయత్రి)	భజే వాయువేగం
అనన్య	గ్యాంగ్ ఆఫ్ గోదావరి

నిడదవోలు

వీ మ్యాక్స్	గ్యాంగ్ ఆఫ్ గోదావరి
రాధాకృష్ణ	భజే వాయువేగం
శ్రీగణపతి	మనమే

దేవరపల్లి

శ్రీరామ్ సినీ మ్యాక్స్	మనమే
శ్రీరామ్ సినీ మ్యాక్స్	మనమే

నల్లజర్ల

శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	గంగం గణేశా
స్క్రీన్ 2	---
శ్రీనివాస	---